ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

ఆదివారం 31 ఆగస్టు 2025


2న ముఖ్యమంత్రి రాక?



విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చే నెల రెండో తేదీన నగరానికి రానున్నారు. తూర్పుతీరంలో నౌకా వ్యాపారం విస్తరణ, ఇతర అంశాలపై మంగళవారం ఉదయం నోవాటెల్ హోటల్‌లో జరగనున్న ఈస్టుకోస్టు మేరిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ఆయన పాల్గొననున్నారు. అయితే ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పూర్తి షెడ్యూల్ ఇంకా వెలువడాల్సి ఉంది.

సేనలో నూతనోత్సాహం

సేనాని ప్రసంగానికి హర్షధ్వానాలతో మార్మోగిన మునిసిపల్ స్టేడియం



అభివాదం చేస్తున్న జన సేనాని



సేనతో సేనాని కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

- జనసేన 'సేనతో సేనాని' సభ సూపర్ సక్సెస్
- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాక వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్యకర్తలు
- కార్యకర్తలకు వేదికపై మాట్లాడే అవకాశం
- జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించిన వీరమహిళ గోవిందమ్మ

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'సేనతో సేనాని' పేరుతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ నగరంలోని ఇందిరాప్రియదర్శిని మునిసిపల్ స్టేడియంలో శనివారం నిర్వహించిన సభ సూపర్ సక్సెస్ అయింది. అంచనాకు మించి భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పవన్ ప్రసంగానికి జేజేలు కొడుతూ అరుపులు, కేకలు, చప్పట్లతో స్టేడియం మార్మోగింది. పవన్ ప్రసంగం కేడర్‌లో నూతనోత్తేజం నింపింది.

జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తలతో నిర్వహించిన 'సేనతో సేనాని' కార్యక్రమం విజయవంతమైంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహించిన తొలి బహిరంగ సమావేశం కావడంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచే కాకుండా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సభలో పవన్ కల్యాణ్ గతానికి భిన్నంగా ప్రసంగించారు. పార్టీ కార్యకర్తలకు భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించడంతో పాటు వారిని నాయకులుగా తీర్చిదిద్దేందుకు తన వద్దనున్న ప్రణాళికలను సుదీర్ఘంగా వివరించారు. వైసీపీ హయాంలో సాగించిన పోరాటాన్ని మననం చేసుకుంటూనే భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకువెళ్లాలనుకుంటున్నదీ వివరించారు. ఇందుకోసం కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని, వారిని నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని, అందుకు పదేళ్ల సమయం పడుతుందని పవన్ స్పష్టం చేశారు. అధినేత ప్రసంగానికి జనసైనికులు, వీర మహిళలు ఆద్యంతం ఈలలు, చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ తరహా సభను కార్యకర్తలతో నిర్వహించడం, అది విజయవంతం కావడంతో పార్టీ నాయకులు, శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

సభను ప్రారంభించిన వీర మహిళ

సాధారణంగా సభలను పార్టీ ముఖ్య నేతలు ప్రారంభిస్తారు. దానికి భిన్నంగా 'సేనతో సేనాని' సభను వీరమహిళ గోవిందమ్మ



మత్స్యకారులు ఇచ్చిన చేపతో పవన్ కల్యాణ్

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నోవాటెల్ హోటల్‌లో పవన్‌ను దిగ్బంధించిన సమయంలో ఆమె మూడేళ్ల చంటి బిడ్డతో జనసేన జెండా పట్టుకుని రాత్రంతా దీక్ష చేసింది. సభా ప్రాంగణంలో మధ్యాహ్నం 4.22 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు సాయంత్రం 6.21 వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. అదే సమయంలో ... మిగతా 8వ పేజీలో

..... మరిన్ని ఫొటోలు 8వ పేజీలో

నిబంధనలకు పాతర అక్రమాల జాతర

అడ్డగోలుగా బహుళ అంతస్థుల భవన నిర్మాణాలు

- సెట్‌బ్యాక్స్ వదలకుండానే ప్రధాన రహదారుల సమీపంలో కట్టడాలు
- జీప్లస్ టూకు అనుమతి తీసుకుని ఐదు అంతస్థుల వరకు నిర్మిస్తున్నవి ఎన్నో..
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ సిబ్బంది



అనకాపల్లి పట్టణంలో సెట్‌బ్యాక్స్ వదలకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ అనకాపల్లి జోన్-7 కార్యాలయ పరిధిలో పలు చోట్ల నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా బహుళ అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. ప్రధాన రహదారులను ఆనుకుని సెట్‌బ్యాక్స్ వదలకుండా బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నా టౌన్ ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

పట్టణంలోని శారదా కాలనీ, వుడ్‌పేట, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, పెరుగుబజార్, రింగ్ రోడ్డు, గవరపాలెం, రఘురామ కాలనీ, లక్ష్మీనారాయణనగర్, లక్ష్మీదేవిపేట, గాంధీనగర్, పూడిమడక రోడ్డు, సుంకరమెట్ట, సిరసపల్లి, కొండకొప్పాకలలో అధిక సంఖ్యలో భారీ



కొండకొప్పాక జాతీయ రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న భవనం

వాణిజ్య భవన నిర్మాణాలు సాగుతున్నాయి. అయితే వీటిలో చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్టు తెలిసింది. కొందరు జీప్లస్ టూ అనుమతులు పొంది ఐదు, నుంచి ఆరు అంతస్థుల భవనాలు నిర్మిస్తున్నట్టు సమాచారం. జీవీఎంసీ పరిధిలో ఒక అసిస్టెంట్ సిటీ ప్లానర్ పోస్టు ఉన్నా, బదిలీపై ఎవరూ రాకపోవడంతో గాజువాక ఏసీపీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే అనకాపల్లి వచ్చి వెళుతున్నారు. ప్రస్తుతం ఒక టౌన్ ప్లాన్ సూపర్‌వైజర్, వార్డు సచివాలయాల్లో ప్లానింగ్ కార్యదర్శులు 14 మంది ఉన్నా, వారు అడ్డగోలు నిర్మాణాలపై సక్రమంగా పర్యవేక్షణ చేయడం లేదనే విమర్శలున్నాయి. కాగా అనకాపల్లి తహశీల్దార్ కార్యాలయానికి వెనుక శారదా కాలనీలో ఒక బిల్డర్ రెసిడెన్సియల్ అపార్టుమెంట్ కోసం తక్కువ మొత్తంలో ... మిగతా 8వ పేజీలో

స్త్రీ శక్తికి విశేష ఆదరణ

జిల్లాలో 15 రోజుల్లో 5,63,514 మంది మహిళల ఉచిత ప్రయాణం



బస్సులో ఆధార్ కార్డులు చూపిస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన ప్రారంభించిన స్త్రీశక్తి పథకానికి విశేష ఆదరణ లభిస్తోంది. 15 రోజుల వ్యవధిలో జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం బస్ కాంప్లెక్స్‌ల నుంచి ఐదు లక్షల 63 వేల 514 మంది మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణాలు చేశారు. వీరిలో అనకాపల్లి డిపో నుంచి మూడు లక్షల 60 వేల 57 మంది, నర్సీపట్నం కాంప్లెక్స్ నుంచి రెండు లక్షల మూడు వేల 457 మంది మహిళలు ఉన్నారని డీపీటీవో వి. ప్రవీణ తెలిపారు. పథకం ప్రారంభానికి ముందు జిల్లా వ్యాప్తంగా 61 శాతం ఉన్న ఓఆర్ ప్రస్తుతం 90 శాతానికి చేరిందని ఆమె తెలిపారు. శనివారం రావులపాలెం సమీపంలోని వాడపల్లి వెంకటేశ్వరస్వామి దర్శనానికి బస్సు అనకాపల్లి నుంచి బయలుదేరింది. అయితే అనకాపల్లి నుంచి ఒక్కటే ఎక్స్‌ప్రెస్ సర్వీస్ వాడపల్లికి ఉండడంతో సుమారు 90 మంది వరకు ప్రయాణికులు ఆ బస్సులో ప్రయాణం సాగించినట్టు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. మహిళలు బస్సు ఎక్కిన వెంటనే ఆధార్ కార్డు చూపించి జీరో ఫేర్ టికెట్ పొందుతున్నారు. ఈ పథకం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో హోం మంత్రి ప్రయాణం

- స్త్రీశక్తి పథకం అమలు తీరుపై అనిత ఆరా



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ జీరో ఫేర్ టికెట్ చూపిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం అమలు తీరుపై హోం మంత్రి అనిత ఆరా తీశారు. ఆమె శనివారం సాయంత్రం వేంపాడు నుంచి అడ్డరోడ్డు వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. ఉచిత బస్సు సదుపాయం ఎలా ఉందని వారిని అడిగి తెలుసుకున్నారు. బస్సులో ఉన్న పిల్లలు, పెద్దలను ఆప్యాయంగా పలకరించారు.

ఆస్పత్రుల అభివృద్ధికి రూ.1.19 కోట్లు మంజూరు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): ఏరియా ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి పనులకు రూ.1.19 కోట్ల నిధులు మంజూరయ్యాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పతిలో గత నెలలో జరిగిన సమీక్షా సమావేశంలో ఏరియా ఆస్పత్రిలో డ్రైనేజీలు, నీటి సరఫరా పైపులు, ఆపరేషన్ థియేటర్‌కి సెంట్రల్ ఆక్సిజన్ వ్యవస్థ ఏర్పాటు, ఓపీడీ బ్లాక్‌కి ప్రత్యేకంగా మినీసెప్టిక్ ట్యాంక్, ఎలక్ట్రికల్ మరమ్మతులు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం, కలెక్టర్ స్పందించి రూ.47 లక్షలు మంజూరు చేశారన్నారు. త్వరలో ఈ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే వేములపూడి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి రూ.5.5 లక్షలు, గుణిపూడి పీహెచ్‌సీకి రూ.2.5 లక్షలు, చీడిగుమ్మల పీహెచ్‌సీకి రూ.8 లక్షలు, నాతవరం పీహెచ్‌సీకి రూ.5.5 లక్షలు, గొలుగొండ పీహెచ్‌సీకి రూ.5 లక్షలు, కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి రూ.5 లక్షలు, పురపాలక సంఘం బొంతువీధి ... మిగతా 8వ పేజీలో

దర్జాగా పంచాయతీ స్థలం కబ్జా

రూ.1.5 కోట్ల విలువైన స్థలం ఆక్రమణ

- ప్రహరీ గోడ నిర్మించిన ఆక్రమణదారులు
- చర్యలు తీసుకోని అధికారులు




రాజుగారిబీడులో పంచాయతీకి చెందినదిగా చెబుతున్న స్థలానికి ప్రహరీ గోడ నిర్మించిన దృశ్యం

పాయకరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):

స్థానిక రాజుగారిబీడులో పంచాయతీకి చెందిన స్థలం ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ స్థలం చుట్టూ ఆక్రమణదారులు ప్రహరీ గోడ కడుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాయకరావుపేట పంచాయతీలోని రాజుగారిబీడులో 1984లో సర్వే నంబర్లు 175, 176లోని సుమారు నాలుగున్నర ఎకరాల్లో కొందరు లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజోపయోగం కోసం కేటాయించిన స్థలాన్ని 15 రోజుల్లో పంచాయతీకి పట్టా రాసి ఇచ్చేందుకు నిర్ణయించి అప్పట్లో పంచాయతీ నుంచి అనుమతి పొందారు. ఆ తరువాత ఈ విషయాన్ని పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ స్థలం ఆక్రమణకు గురైంది. దీంతో పంచాయతీ అధికారులు ఆక్రమణదారులపై ఎలమంచిలి కోర్టులో కేసు వేయడంతో 2019లో పంచాయతీకి అనుకూలంగా తీర్పు వచ్చింది. అప్పటి నుంచి రాజుగారిబీడులో కోర్టు ద్వారా సాధించిన కమ్యూనిటీ స్థలం పంచాయతీ ఆధీనంలో ఉందని చెబుతున్నారే తప్ప కనీసం పట్టించుకోలేదు. దీంతో సుమారు రూ.1.5 కోట్ల విలువైన ఈ స్థలం చుట్టూ ప్రస్తుతం ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతోంది. విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది వెళ్లి పనులు ఆపాలని తెలియజేసినా ఆక్రమణ దారులు పట్టించుకోలేదు. కాగా ఉన్నతాధికారులు స్పందించి ఈ స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ ఇన్‌చార్జి ఈవో కె.డేవిడ్‌ను వివరణ కోరగా, రాజుగారిబీడులో కమ్యూనిటీ స్థలంగా గుర్తించిన స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించిన వారికి నోటీసు ఇస్తున్నామని తెలిపారు.

విశిష్ట అలంకరణలో విఘ్నేశ్వరుడు



- పసుపు, కుంకుమ వర్ణంలో స్వయంభూ గణపతి

స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల నాల్గవ రోజైన శనివారం స్వయంభూ గణేశుడు పసుపు, కుంకుమ వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కొడమంచిలి చలపతి అధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. - చోడవరం/ఆంధ్రజ్యోతి

జ్వరాల విజృంభణ

జ్వర పీడితులతో ఆస్పత్రులు కిటకిట

- వాతావరణంలో మార్పులే కారణం



స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి వచ్చిన జ్వర పీడితులు

చోడవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. గత రెండు వారాలుగా వరుసగా భారీ వర్షాలు కురిసి, వెంటనే ఎండలు కాయడం, తరచూ ఎండలతో పాటు మబ్బులు కమ్ముకోవడం వంటి వాతావరణంతో గ్రామాల్లో జ్వరాలు ప్రబలాయి. జలుబు, దగ్గుతో పాటు జ్వరంతో ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉందని వైద్యాధికారులు తెలిపారు. స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి గత వారం రోజులుగా రోజుకు కనీసం 30 మందికి పైగానే జ్వర పీడితులు వస్తున్నట్టు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అంతే కాకుండా జ్వరాలతో బాధపడుతున్న కొందరు మెడికల్ షాపులో మందులు కొనుక్కోని వేసుకుంటుంటే, మరికొందరు ఆర్ఎంపీ వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నారు. వాతావరణ ప్రభావంతో వచ్చే వైరల్ జ్వరాలే ఎక్కువగా ఉంటున్నట్టు స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యాధికారి దినేశ్‌కుమార్ తెలిపారు.

ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఉమ్మడి జిల్లాలో 1,139 పోస్టులకుగాను 1,138 మంది 1,138 అభ్యర్థులు హాజరు

- ఒకరు ఇటీవల మృతి
- జోన్ పరిధిలో 307 మంది హాజరు

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాల్లో కీలకమైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయంలో గురువారం నుంచి ఈ కార్యక్రమం మొదలైంది. ఉమ్మడి జిల్లాలో పాఠశాల విద్యా శాఖ నుంచి 734, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 400, జువెనైల్ శాఖ పరిధిలో ఐదు పోస్టులు...మొత్తం 1,139 పోస్టులకుగాను 1,138 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఒక అభ్యర్థి ఇటీవల మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా విద్యా శాఖకు సమాచారం అందించారు.

కాగా జోన్-1 పరిధిలో వివిధ కేడర్‌లలో 307 పోస్టులకుగాను 307 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. అయితే ఉమ్మడి జిల్లాలో పోస్టులు, జోన్ పోస్టులకు వచ్చిన అభ్యర్థులలో ఆరేడుగురు సరైన సర్టిఫికెట్లు ... మిగతా 8వ పేజీలో

సబ్ జైలును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



ముద్దాయిలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

ఎలమంచిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సబ్ జైలును ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముద్దాయిలతో మాట్లాడి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రసాద్, ప్యానెల్ న్యాయవాదులు బి.హరి శంకర్‌రావు, పెరుమాళ్ల వెంకట రమణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'అమెరికా టారిఫ్ భారాన్ని ప్రభుత్వమే భరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అమెరికా విధించిన టారిఫ్ భారాన్ని ప్రభుత్వమే భరించి పరిశ్రమల మనుగడ, కార్మికుల ఉపాధికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పరిశ్రమల ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపే అమెరికా నిర్ణయాన్ని వెనక్కు తీసుకొనేలా మోదీ ప్రభుత్వం ఒత్తిడిని తీవ్ర తరం చేయాలన్నారు. టారిఫ్ పెంపుతో 22 వేల మందికి ఉపాధి కల్పిస్తున్న బ్రాండిక్స్ వస్త్ర పరిశ్ర మ దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తిని తగ్గించినా, నిలిపివేసినా మహిళల ఉపాధి కోల్పోతారన్నారు. టారిఫ్ భారంతో పరిశ్రమలు దెబ్బతినకుండా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కె.సోములు తదితరులు పాల్గొన్నారు.

'మైహోమ్ సిమెంటు'లో 80 మంది రక్తదానం



రక్తాన్ని దానం చేస్తున్న కర్మాగారం కార్మికులు

ఎలమంచిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ములకలాపల్లిలో గల మై హోమ్ సిమెంటు పరిశ్రమ ఆవరణలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ యూనిట్ హెడ్ బి.రామస్వామి మాట్లాడుతూ పరిశ్రమ స్థాపించి 18వ సంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విశాఖ ఎన్టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులు, కాలనీ మహిళలు ఎనభై మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీజీఎం (పీఅండ్‌పి) ఎల్.శ్రీనివాసరావు, ఓహెచ్‌సీ ఇన్‌చార్జ్ బి.రాజు, ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్యులు సత్యనారాయణ, పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామం తరలించకుండానే.. కంపెనీ ఏర్పాటా..?

▸▸ కృష్ణంపాలెం గ్రామస్థుల ఆవేదన ▸▸ పంచదార్ల రెవెన్యూలో కాలనీ ఏర్పాటుకు వినతి ▸▸ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్



కంపెనీ ఏర్పాటుకు ఎస్‌ఈజెడ్ తీసుకున్న కృష్ణంపాలెం గ్రామం

రాంబిల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : 'గ్రామాన్ని తరలించలేదు.., ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదు.., ఇళ్ల స్థలాలు కేటాయించలేదు.. అయినా గ్రామంలో కంపెనీ ఏర్పాటు పనులు ఎలా ప్రారంభిస్తారు' అని ఎస్‌ఈజెడ్‌కు భూములిచ్చిన మండలంలోని కృష్ణంపాలెం గ్రామస్థులు మండిపడుతున్నారు. 2006వ సంవత్సరంలో ఎస్‌ఈజెడ్ కోసం ఏపీఐఐసీ సుమారు 350 ఎకరాల భూమిని రైతుల నుంచి తీసుకుంది. సదరు భూములకు ఎకరాకు రూ.5,50,000లు చొప్పున నష్ట పరిహారంగా చెల్లించింది. భూసేకరణలో కోల్పోయిన ఇళ్లకు నష్టపరిహారం ఇచ్చారు. ఇదే మండలం పంచదార్ల రెవెన్యూలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పారని, ఇందుకోసం 32.49 ఎకరాల భూమిని కేటాయించారని గ్రామ నిర్వాసితులు తెలిపారు. అయితే నేటికి 18 సంవత్సరాలు గడిచినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని వారంతా వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం పెద్దలు, అధికారులు గ్రామంలో సభ నిర్వహించి వేరే చోట ఆర్‌అండ్ కాలనీ ఇస్తామని చెప్పారన్నారు. కానీ తాము గతంలో కేటాయించిన పంచదార్ల రెవెన్యూలోనే ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలను కుటుంబాల వారీగా ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. నిర్వాసితులమైన తమ అభిప్రాయాలు తీసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారని వారంతా వాపోయారు. నిర్వాసితులందరికీ ఒకేచోట ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన ఏపీఐఐసీ అధికారులు తమ గ్రామంలోని వారికి ఒకే చోటకాకుండా లాటరీ పద్ధతిలో కుటుంబాలు విడిపోయే విధంగా ఇళ్ల స్థలాలు కేటాయించారని ఆరోపించారు. గ్రామాన్ని తరలించకుండానే గ్రామాన్ని ఆనుకొని ఉన్న స్థలాల్లో కంపెనీ పనులు ప్రారంభిస్తే ఎలా అని సదరు నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించి, గ్రామాన్ని తరలించిన తరువాతే కంపెనీ పనులు ప్రారంభించాలని అంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నిర్వాసిత కుటుంబాలకు గతంలో కేటాయించిన పంచదార్ల రెవెన్యూలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.25 లక్షలు ఇవ్వాలని, గ్రామాన్ని తరలించేంత వరకు ప్రతి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, పాడి పశువులకు షెడ్లు ఏర్పాటు చేయాలని, గ్రామ దేవతల ఆలయాలు నిర్మించి ఇవ్వాలని కృష్ణంపాలెం ఎస్‌ఈజెడ్ నిర్వాసితులు కోరుతున్నారు.



గ్రామం వద్ద కంపెనీ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన బోర్డు

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటు



బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరాను పరిశీలిస్తున్న ఎస్ఐ సావిత్రి

ఎలమంచిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పోలీసులు శుక్రవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటి పనితీరును పట్టణ ఎస్ఐ కె.సావిత్రి పరిశీలించి మాట్లాడారు. బస్టాండ్‌లో ఎటువంటి చోరీలు జరగకుండా ప్రయాణికుల సౌకర్యార్థం వీటిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. బస్సులు ఎక్కే సమయం, దిగే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ లగేజీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలని ప్రయాణికులకు సూచించారు. కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగినట్టు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

▸▸ ఈ క్రాప్‌ను రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలి

▸▸ జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు




నామవరంలో రైతులకు సూచనలు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నక్కపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సూచించారు. మండలంలోని మనబాలవానిపాలెం, కాగిత, ఉద్దండపురం, గొడిచెర్ల గ్రామాల్లో శనివారం వరి నాట్లను పరిశీలించారు. రైతులకు ఎరువులు, కలుపు యాజమాన్యంతో పాటు వ్యవసాయ యాంత్రీకరణ సర్వేపై అవగాహన కల్పించారు. వరినాట్లు వేసిన తరువాత మూడు, లేదా నాలుగు రోజుల్లోగా ఆక్సాడయార్జిల్ పొడి మందును 35 గ్రాములు లేదా ప్రిటిలాక్లోర్ 500 మి.మీ. ఎకరానికి 20కిలోల ఇసుకలో కలుపుకుని బురద పదునుపై పొలాల్లో చల్లుకోవాలని సూచించారు. వరిలో పలు దశల్లో ఎటువంటి యాజమాన్య పద్ధతులు పాటించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉమా ప్రసాద్, వీఈవో సాయి కుమారి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్: ఈ క్రాప్ పంట నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు అన్నారు. శనివారం ఆయన నామవరం, పి.ఎల్.పురం గ్రామాలలో వరినాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ క్రాప్ లేకుంటే పంట నష్టం, బీమా పథకాలు అందవని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఉమాప్రసాద్, ఏవో పి.ఆదినారాయణ, ఏఈవో నాగమణి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



బోల్తాపడిన కొబ్బరి బొండాల లోడు ట్రాక్టర్

నక్కపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపూడి హైవే జంక్షన్ వద్ద శనివారం రాత్రి 7 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానిక సీఐ కె.కుమారస్వామి అందించిన వివరాలివి.. కొబ్బరిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న టాంకర్ లారీ ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న ఎస్.రాయవరానికి చెందిన కర్రి వెంకట సూరి (45) అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ



సర్పంచ్ సమకూర్చిన స్టీల్ బాటిళ్లను చూపుతున్న విద్యార్థులు

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మరాజుపేట మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆ గ్రామ సర్పంచ్ దంపతులు శరగడం భాగ్యలక్ష్మి, శివబాపు నాయుడు శనివారం స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ బాటిళ్లలో విద్యార్థులు నీటిని తెచ్చుకుని తాగుతుండడం వల్ల ఆరోగ్యం పాడయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇది గుర్తించి స్టీల్ బాటిళ్లను సమకూర్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మారిశెట్టి వెంకటఅప్పారావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పారా వాలీబాల్ వరల్డ్ కప్‌కు ఎంపికపై అభినందన




వరల్డ్ కప్‌కు ఎంపికైన గణేశ్‌ను అభినందిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలం సోముదేవపల్లికి చెందిన అన్నం గణేశ్ అక్టోబర్ 12 నుంచి అమెరికాలో జరగనున్న పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గణేశ్‌ను శనివారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద హోం మంత్రి వంగలపూడి అనిత అభినందించారు. గణేశ్ చిన్నప్పటి నుంచి పారా స్పోర్ట్స్‌పై ఆసక్తితో సాధన చేస్తూ, జాతీయ జట్టుకు ఎంపికకావడం ఎంతో గర్వకారణమని హోం మంత్రి కొనియాడారు. అంతర్జాతీయ పారా వాలీబాల్ క్రీడలో కూడా రాణించాలని ఆమె ఆకాంక్షిస్తూ, కొంత నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం ఎస్.రాయవరం టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, నక్కపల్లి బీజేపీ నాయకుడు కోసూరి శ్రీను తదితరులున్నారు.

హైవేపై ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

▸▸ డీఎస్పీ శ్రీనివాసరావు



అడ్డరోడ్డు సమీపంలో డ్రోన్ సర్వే ద్వారా బ్లాక్ స్పాట్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ, ఇతర అధికారులు

ఎస్. రాయవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని జాతీయ రహదారిపై శనివారం డీఎస్పీ, నక్కపల్లి రూరల్ సీఐ రామకృష్ణ, నర్సీపట్నం ఏఎంవీఐ ఎస్వీఆర్ మూర్తి, హైవే సేఫ్టీ అథారిటీ నవీన్‌తో కలిసి డ్రోన్ ద్వారా పలు ప్రాంతాల్లోని ప్రమాద స్థలాలు (బ్లాక్‌స్పాట్)లను గుర్తించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జాతీయ రహదారిపై గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడున్న అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు చేశారు.

విద్యుత్ సిబ్బందిపై డీఈ ఆగ్రహం

నక్కపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలోని పలు చోట్ల పనిచేస్తున్న విద్యుత్ సిబ్బంది, స్థానిక అధికారులపై అనకాపల్లి డీఈ రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందట హోం మంత్రి అనిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్‌శాఖాధికారుల తీరుపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై 29న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై డీఈ రాజశేఖర్ స్పందించారు. శుక్రవారం నక్కపల్లి, పాయకరావుపేట మండల స్థాయి విద్యుత్‌శాఖాధికారులు, సిబ్బందితో సమావేశాలు నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా మీటర్ల మార్పు, ఇతర సేవల్లో వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసినా, ఇతరేతర ఆరోపణలు వచ్చినా చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.

జీడీపీ వృద్ధి రేటు ఏటా15 శాతం పెరగాలి: డీఆర్‌డీఏ పీడీ



మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ శచీదేవి

కోటవురట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీడీపీ వృద్ధిరేటు ఏటా 15 శాతం పెరిగే విధంగా మండలస్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి అన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో వివిధశాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవోపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వెలుగుశాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు 500 నుంచి 600 పాడి పశువులు కొనుగోలుచేసి రైతులకు వెలుగుశాఖ స్త్రీనిధి, ఉన్నతిపథకం ద్వారా, లేదా బ్యాంకుల ద్వారా అందించాలన్నారు. ఒక పశువు ఉన్న రైతుకు రెండో పశువును ఇతర జిల్లాల్లో సంతల్లో కొనుగోలు చేసి రుణాల రూపంలో అందిస్తే పాడిరైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. 600 పశువుల పంపిణీ లక్ష్యం సాధనకు కృషిచేయాలని సూచించారు. మండలంలో ప్రస్తుతం యూరియా కొరత ఉందా.. అని ఏవో సరోజినిని ఆమె ప్రశ్నించారు. ఏవో వరిసాగు రైతులు ఇతరపంటలకు యూరియాను మళ్లించడంతో కొరత నెలకొంటుందన్నారు. ఖరీఫ్ పంటలకు కాకుండా పశువుల మేతకు సంబంధించి పశుగ్రాసంనకు యూరియా వినియోగంవల్ల కిడ్నీ, లివర్, గుండె తదితర జబ్బులు సోకే ప్రమాదం ఉందన్నారు. పంచాయతీలు సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారుచేస్తే ఈపరిస్థితి వచ్చేదికాదున్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దివ్య ప్రబంధ ప్రచార వాహిని బిరుదు ప్రదానం



రోహిణికి బిరుదు ప్రదానం చేస్తున్న ఉపమాక ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యులు

నక్కపల్లి,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వికాస తరంగిణి, శ్రీవైష్ణవ గోష్టి పరిధిలో 200 మంది మహిళలకు నాలాయిర దివ్య ప్రబంధాన్ని నేర్పిస్తున్న కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన కూరపాటి రోహిణికి శనివారం వికాసతరంగణి నిర్వాహకులు, శ్రీవైష్ణవ గోష్టి ప్రతినిధులు దివ్య ప్రబంధ ప్రచార వాహిని బిరుదుని ప్రదానం చేశారు. ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు ఆలయం వద్ద రోహిణికి రజత సన్మాన పత్రం, బిరుదును అందజేశారు. స్వామివారి శేష వస్త్రాలతో రోహిణి దంపతులను సత్కరించారు. ముందుగా ఆలయంలో నమ్మాళ్వార్లకు , ద్వాదశ ఆళ్వార్లకు షోడశోపచార పూజలు, నమ్మాళ్వార్లకు అష్టోత్తర శతనామార్చన పూజలను ప్రసాదాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నున్న సుభాశ్ పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలుపుదల

పాయకరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇందిరాకాలనీలో దెబ్బతిన్న తాగునీటి పైపులైన్‌కు మరమ్మతుల చేపట్టనున్నందున స్థానిక ఇందిరాకాలనీ, లింగాల తోటకాలనీల్లో ఆదివారం కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలుపుదల చేయనున్నట్టు డిప్యూటీ ఎంపీడీఓ కె.డేవిడ్ తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

భూ సమస్యలపై సమావేశం



సమీక్షిస్తున్న తహశీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ, తదితరులు

కోటవురట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ వివాదాలు పరిష్కారంపై శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మండల లెవెల్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. తహసీల్దార్ తిరుమల బాబు అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నలుగురు రైతులకు చెందిన భూ సమస్యలపై ఇరువర్గాల విన్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏఎస్ఐ గంగరాజు, డీటీ రమేశ్ తెలిపారు.

తెలుగు పండిట్‌కు పురస్కారం

నక్కపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న ఎన్‌వీఎస్ ఆచార్యులకు శనివారం (హ్యూమన్ రైట్స్ యాంటీ క్రైం) మానవ హక్కులు- నేర నిరోధక విభాగం ఆధ్వర్యంలో శిక్షా రత్న పురస్కారాన్ని విశాఖలో అందజేశారు. విశాఖ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం నేషనల్ చైర్మన్ బోడ రాకేశ్ ఈ పురస్కారాన్ని ఆచార్యులకు అందజేశారు. విద్యార్థులకు పలు రంగాల్లో శిక్షణ ఇస్తుండడంతోపాటు, అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక సేవా రంగాల్లో చేస్తున్న కృషినికి ప్రశంసించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జయశ్రీ ,ఉపాధ్యాయులు, పలువురు పెద్దలు ఆయనను అభినందించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా యూరియాను విక్రయించాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు



గుడివాడలో గల ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఎస్. రాయవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా యూరియాను దుకాణ యజమానులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి బి. మోహనరావు ఆదేశించారు. మండలంలోని గుడివాడలో ఉన్న ఎరువుల షాపు (విశాఖ ఏజెన్సీ)లో శనివారం తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో ఉన్న యూరియా నిల్వలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం యూరియా విక్రయాలు చేపట్టాలని సూచించారు. అనంతరం విక్రయాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవోలు సౌజన్య, ఉమాప్రసాద్ పాల్గొన్నారు.

డ్రోన్‌తో యూరియా పిచికారీ పరిశీలన

మండలంలోని దార్లపూడి గ్రామంలో నిర్వహిస్తున్న డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ విధానాన్ని శనివారం జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పిచికారీతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. అలాగే, యూరియాపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం నాట్లు వేసిన వారంతా పంటలో యూరియాతో పాటు డీఏపీ కూడా వేసినట్లయితే వేరు వ్యవస్థ బాగా ఎదిగి పంట ఆరోగ్యంగా ఉటుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు సౌజన్య, ఉమాప్రసాద్, గ్రామ సర్పంచ్ సుభాషిని, ఉప సర్పంచ్ పోలిశెట్టి శ్రీను, నాయకుడు పోలిశెట్టి పెదఈశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.


కేజీబీవీ తనిఖీ



భోజనం తయారీని పరిశీలిస్తున్న సెక్రటరీ దేవానందరెడ్డి

నక్కపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి కేజీబీవీని శనివారం మధ్యాహ్నం కేజీబీవీ విద్యాసంస్థల రాష్ట్ర సెక్రటరీ దేవానందరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పిల్లలకు పెడుతున్న మధ్యాహ్న భోజనం తయారీని ఆయన పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావారణంలో మెనూ ప్రకారం వంటలు చేస్తుండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికల డార్మిటరీలను తనిఖీ చేశారు. టెన్త్, ఇంటర్ పిల్లలతో మాట్లాడారు. టెన్త్ సిలబస్ పై ఆరా తీశారు. ఒత్తిడి లేకుండా చదవాలని విద్యార్థులకు సూచించారు. శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. ప్రిన్సిపల్ సలీమాతో మాట్లాడి పలు ఆదేశాలు జారీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడికి పరామర్శ



వైసీపీనేత ధనిశెట్టి బుజ్జిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

పాయకరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలికి ఆపరేషన్ చేయించుకున్న వైసీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ భర్త ధనిశెట్టి తిరుమల్లేశ్వరరావు (బుజ్జి)ని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు తదితరులు పరామర్శించారు. శనివారం పట్టణంలో బుజ్జి స్వగృహానికి వచ్చిన కంబాల జోగులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు తదితరులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు ధని శెట్టి బాబూరావు, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఆ పార్టీ మండల అధ్యక్షుడు గెడ్డమూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ఎస్. రాయవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం సమీపంలో సీతారామ యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద శనివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఆదమరిస్తే.. ఆసుపత్రికే..

కొత్తూరు బ్రిడ్జిపై అధ్వానంగా ఫుట్‌పాత్‌లు

- సిమెంటు పలకలు ధ్వంసం
- రక్షణ గోడలకు రంగులతో సరిపెట్టిన అధికారులు
- ఆర్‌అండ్‌బీ శాఖ తీరుపై పలువురు ఆగ్రహం



ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా గుంత



కొత్తూరు బ్రిడ్జిపై రక్షణ గోడలకు రంగులు వేసి, ఫుట్‌పాత్‌పై పలకలు ధ్వంసమైనా పట్టని దృశ్యం



కొత్తూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల వద్ద గల బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌లు ప్రమాదకరంగా మారాయి. ఇరువైపులా సిమెంటు పలకలు ధ్వంసం కావడంతో వీటిపై నడిచే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ బ్రిడ్జి మీదుగా నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటువంటి సమయంలో బ్రిడ్జిపై నడిచి వెళ్లేవారు సరక్షితంగా రాకపోకలు సాగించాలన్న ఉద్దేశ్యంతో చాలా ఏళ్ల కిందట ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లేవారితో పాటు పొలం పనులకు, వివిధ పనులపై వచ్చే గ్రామీణులతో సందడిగా ఉంటుంది. దీని నిర్వహణను పట్టించుకునేవారు కరువవ్వడంతో ప్రస్తుతం ఫుట్‌పాత్‌లపై సిమెంటు పలకలు పలుచోట్ల ధ్వంసమయ్యాయి. ఫలితంగా నడిచి వెళ్లేవారు గాయాలకు గురవుతున్నారు. పగలు ఎలాగోలా వెళుతున్నా, రాత్రి వేళ చీకటి పడిన తరువాత పలకలు శిథిలమై గుంతలుగా ఏర్పడిన చోట అడుగు పడి పలువురు గాయపడుతున్నారు. ఇటీవల ఈ బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రక్షణ గోడలకు ఆర్‌అండ్‌బీ అధికారులు రంగులు వేయడం ప్రారంభించారు. ఇది చూసిన పాదచారులు ఫుట్‌పాత్‌లకు కూడా మరమ్మతులు చేపడతారని సంబరపడ్డారు. కానీ సదరు అధికారులు ఈ విషయాన్ని విస్మరించారు. ఇప్పుడు వీటిపై నడిచి వెళ్లాలంటేనే జనం హడలిపోతున్నారు. అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఫుట్‌పాత్‌లపై సిమెంటు పలకలు కొత్తవి నిర్మించాలని కోరుతున్నారు.



విగ్రహాల అనుపు సందర్భంగా ఏలేరు కెనాల్ వద్ద సందడి

జైజై గణేశ.. బైబై గణేశ

- కొప్పాక ఏలేరు కెనాల్‌లో భారీగా విగ్రహాల నిమజ్జనం
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా రూరల్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు

కొత్తూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కొప్పాక ఏలేరు కెనాల్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనం శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కోలాహల వాతావరణంలో సాగింది. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో విగ్రహాలను వేళతాళాలు, బాజాభజంత్రీలు, పిల్లలు, యువకుల కేరింతల నడుమ వాహనాల ద్వారా పెద్ద సంఖ్యలో ఇక్కడికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు రవి కుమార్, నాగేశ్వరరావు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. కెనాల్ లోపలికి ఎవరినీ వెళ్లనీయకుండా ఆంక్షలు విధించారు. క్యూ పద్ధతి ద్వారా విగ్రహాల నిమజ్జనం జరిగేలా చూడడంతో పాటు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేవారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

లక్కీడ్రా ద్వారా రెండు బార్‌లు మంజూరు



బార్‌ల కేటాయింపునకు డ్రాతీసున్న అధికారులు

అనకాపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలోని రెండు మద్యం బార్‌లను లక్కీడ్రా ద్వారా దరఖాస్తుదారులకు కేటాయించారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లో డీఆర్‌వో సత్యనారాయణ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ ఆధ్వర్యంలో దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా తీశారు. జిల్లాలో నర్సీపట్నం మునిసిపాలిటీలో ఒక బార్, ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలో ఒక జనరల్ కేటగిరీ బార్, ఒక గీత కార్మిక కోటా బార్‌లకు అనుమతులు ఇవ్వాలని భావించారు. ఆగస్టు 29వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. 2025-28 నూతన బార్ విధానంలో నిబంధనల ప్రకారం ఒక బార్‌కు డ్రా తీయాలంటే కనీసం నాలుగు దరఖాస్తులు అందాల్సి ఉంది. జిల్లాలో నర్సీపట్నం మద్యం బార్‌కు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలో జనరల్ కోటాలో ఒక బార్‌కు, గీత కార్మికుల కోటాలో మరో బారుకు నాలుగు చొప్పున 8 దరఖాస్తులు అందడంతో లక్కీడ్రా తీసి బార్‌లు మంజూరు చేశారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి రమేశ్



సబ్ జైలులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేశ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సబ్ జైలును శనివారం మొదటి అదనపు సివిల్ జడ్జి రమేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో గల వివిధ బ్లాక్‌లను పరిశీలించి, నిందితులతో మాట్లాడారు. అధికారులు అందిస్తున్న ఆహారం, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారికి మండల లీగల్ సెల్ అథారిటీ అందిస్తుందని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, న్యాయ సహాయకులు సాయిరాం, తులసీరావు, రోజా తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ కార్మికులకు హెల్త్ అలవెన్సు ఇవ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, హెల్త్ అలవెన్సు ఇవ్వాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆర్.శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ నిర్వహించిన యూనియన్ సమావేశంలో మాట్లాడారు. సీఐటీయూ పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌లకు, గార్డులకు నెలకు రూ. నాలుగు వేలు హెల్త్ అలవెన్సు ఇవ్వాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ ఆదేశాలను అన్ని పంచాయతీల్లో తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ములకలపల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి దాకా శ్రీనివాసరావు, అర్జున్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం దళితవాడలో పౌర హక్కుల దినోత్సవం



దళిత వాడలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కొత్తూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం దళితవాడలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో డి.రాము, తహశీల్దార్ కార్యాలయం అధికారి సిద్ధేశ్వరరావు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బొడ్డేడ అప్పారావు హాజరై సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నివాసితులు మాట్లాడుతూ కమ్యూనిటీ భవనాన్ని నిర్మించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వసతిగృహ సంక్షేమాధికారి బి.హెచ్.రామయ్య మాట్లాడుతూ దళితవాడలో ఉన్న విద్యార్థులను వసతి గృహాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో భరద్వాజ్, అనకాపల్లి రూరల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా విద్యా బోధన

- ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశంలో డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

లంకెలపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన సాగించాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు సూచించారు. ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులకు చక్కగా అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధిస్తే వారు సత్ఫలితాలు సాధిస్తారన్నారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై మరింత దృష్టి సారిస్తే వారు సైతం మంచి మార్కులు పొందేందుకు ఆస్కారం ఉంటుందని వివరించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు నిరంతరాయంగా నేర్చుకుంటూ వాటిని విద్యార్థులకు బోధించాలన్నారు. రిసోర్స్‌పర్సన్ ఎన్‌వీఆర్ మూర్తి, హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, శ్రీనాథ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు, చిత్రంలో కార్పొరేటర్ శ్రీనివాస్

లంకెలపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెంలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్‌బీఆర్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఉత్తరాంధ్ర స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలుత మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందు ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో తలపడాని సూచించారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, స్థానిక నాయకులు ఆర్‌బీఆర్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ

తుమ్మపాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన ఎరువులు అందించకుంటే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సీహెచ్.సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. మండలంలోని పలు హోల్‌సేల్, రిటైల్ ఎరువుల దుకాణాలను శనివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను నిర్ణయించిన ధరకే రైతులకు అందించాలన్నారు. యూరియాతో పాటు ఎలాంటి అదనపు ప్రొడక్ట్‌లను ఇవ్వరాదన్నారు. అలాగే నానో యూరియా, నానో డీఏపీ వాడేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రికార్డులను పక్కా నిర్వహించాలని, తేడాలు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వాడకంతో భవిష్యత్తు చిత్తు

- జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ భాగ్యలక్ష్మి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ భాగ్యలక్ష్మి

సబ్బవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్.భాగ్యలక్ష్మి సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. మత్తుకు బానిసైతే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. మాదక ద్రవ్యాలతో పట్టు బడితే పడే శిక్షలను వివరించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, ఎన్‌ఎస్‌ఎస్ కో- ఆర్డినేటర్ డాక్టర్ గణేశ్, అధ్యాపకులు రిఫత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజకీయ పార్టీల కుట్ర

- ఎస్సీ వర్గీకరణ పోరాట కమిటీ జాతీయ అధ్యక్షుడు రత్నాకర్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రత్నాకర్

తుమ్మపాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ రాజకీయ పార్టీల కుట్ర అని ఎస్సీ వర్గీకరణ పోరాట కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్ అన్నారు. అనకాపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల మధ్య ఐక్యతను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. దేశంలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలను ప్రధాని మోదీ నిర్వీర్యం చేశారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు మాల సామాజికవర్గంపై కక్షసాధింపు చర్యలకు పూనుకుంటున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ అంశంపై నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే ఎస్సీ వర్గీకరణ అంశాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, అంగులూరి ఈశ్వర్, రేబాక మధుబాబు, బి.వినోద్‌కుమార్, షేక్ జిలానీ, టి.సుబ్బారావు, ఎన్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగికి గుర్తింపు తెచ్చేవి సేవలే'



రిటైర్డు హెచ్‌ఎం అప్పారావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ గాదె

కశింకోట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి డీపీఎన్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆర్.వి.అప్పారావు శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటైన అభినందన సభలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ముఖ్య అతిథిగా మాట్లాడారు. అప్పారావు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు పదో తరగతిలో చక్కని ఫలితాలు సాధించేలా కృషి చేశారని ప్రశంసించారు. ఏ ఉద్యోగికైనా విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపు తెచ్చాయని వివరించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకే పదవులు : పీలా



సీఎం సహాయ నిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకే పదవులు వరిస్తాయని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. పట్టణంలో పలువురికి శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం టీడీపీ శ్రేణులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. పార్టీలో పదవుల పంపిణీ విషయంలో యువత, మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులకే నామినేటెడ్ పదవులు లభించనున్నాయన్నారు. త్వరలో 57 బీసీ కులాలకు బీసీ సాధికార నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి బాబి, పచ్చికూర రాము, కేకేవీఏ నారాయణరావు, మాదంశెట్టి నీలబాబు, బీఎస్‌ఎంకే జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దోమ తెరల పంపిణీ



విద్యార్థులకు దోమ తెరలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం దోమ తెరలను పంపిణీ చేశారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యాధులు ప్రబలకుండా దోమల తెరలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీవో జి.రామారావు, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కాల పరిమితిని మూడు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వుల జారీ అయినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి నవంబరు వరకు పొడిగించినట్లు ఆమె తెలిపారు. కొత్త కార్డుల జారీ ప్రక్రియ ఈ గడువులోగా చేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. మీడియా సంస్థలు ప్రస్తుత అక్రిడిటేషన్ కలిగి ఉన్న తమ జర్నలిస్టుల జాబితాను సెప్టెంబరు ఐదో తేదీ లోగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి అందజేయాలని ఆమె తెలిపారు.

ఉచిత ఉపకరణాల పంపిణీకి నిర్ధారణ పరీక్షలు

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాల పంపిణీకి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్టు సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఆర్.జయప్రకాష్ తెలిపారు. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు కానున్నట్టు వివరించారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు ఉచితంగా పొందవచ్చునన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న వాహనానికి భారీ జరిమానా

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అధిక లోడుతో వెళ్తున్న క్వారీ లారీకి రవాణాశాఖ అధికారులు భారీగా జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. జాతీయ రహదారిలోని నూకాంబిక ఆలయ ముఖ ద్వారం వద్ద శనివారం మధ్యాహ్నం వాహనాలు తనిఖీ చేస్తుండగా, భారీ లోడుతో విశాఖపట్నం వైపు నుంచి కశింకోట మార్గంలో వస్తున్న వాహనాలను తనిఖీ చేశామన్నారు. ఓ క్వారీ వాహనం భారీ లోడుతో వెళ్తుండడంతో కేసు నమోదు చేసి రవాణాశాఖ అధికారులకు అప్పగించగా, వారు రూ. 68వేలు జరిమానా విధించారన్నారు. నిబంధనలు అతిక్రమించే వాహనాలపై చర్యలు తప్పవన్నారు.

వినాయక లడ్డూ ప్రసాదం వేలం

పరవాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా రావాడ పంచాయతీ బొట్టవానిపాలెంలో ఏర్పాటు చేసిన గణేష్ యూత్ వినాయక మండపం వద్ద నైవేద్యంగా సమర్పించిన ఐదు కేజీల లడ్డూకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తుడు రూ.ఎనిమిది వేలకు దక్కించుకున్నారు. అనంతరం స్వామి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించి, నిమజ్జనం చేశారు.

శారదానగర్‌లో పూడికతీత పనులు

కొత్తూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శారదా నగర్ ఆరో వీధిలో కాలువల్లో పూడికతీత పనులు శనివారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, పంచాయతీ కార్యదర్శి సుభాష్ ఆయా పనులను పర్యవేక్షించారు. బయటకు తీసిన చెత్తను ట్రాక్టర్ ద్వారా తరలించే ఏర్పాటు చేశారు. కాలువలపై నిర్మించి సిమెంటు పలకల వల్ల కాలువల నిర్వహణ సక్రమంగా జరగడం లేదని స్థానికులు తెలిపారు. అంతేకాకుండా మరికొంత మంది తాగునీటి సమస్య తదితరాలను వారి దృష్టికి తీసుకు వెళ్లారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం: డీఎంహెచ్‌వో



ఈదులపాలెం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరరావు నాయుడు

పాడేరురూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ఎపిడిక్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరరావు నాయుడు ఆదేశించారు. మండంలోని మారుమూల ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. పీహెచ్‌సీలో జరుపుతున్న ప్రసవాలు, నమోదైన మలేరియా కేసులు, అందిస్తున్న వైద్య సేవల వివరాలను వైద్యాధికారిని అడిగితెలుసుకున్నారు. ఎపిడిమిక్ సీజన్‌లో వైద్య సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి సకాలంలో రోగులను గుర్తించి వైద్యసేవలందించాలన్నారు.పీహెచ్‌సీలో ఉన్న మందుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి తోపాటు జిల్లా కార్యాలయ ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెలి సింహాద్రి, ఎం.సంజీవ్ పాత్రుడు, పీహెచ్‌సీ హెల్త్ ఎ డ్యుకేటర్ శివరామకృష్ణ, డి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సంతలో పోలీసులు విస్తృత తనిఖీలు



ముంచంగిపుట్టు సంతలో గస్తీ కాస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో ఎస్ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంత నలుమూలల పోలీసులు గస్తీ నిర్వహించారు. సంతకు వచ్చి, వెళ్లే వాహనాలు, ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేశారు. మారుమూల గ్రామాలకు వెళ్లే వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టిశారించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించ రాదని, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

వెలుగు వీవోఏల సంఘం జిల్లా నూతన కార్యవర్గం



జిల్లా అధ్యక్షురాలిగా భాను



కార్యదర్శిగా రాజుకుమార్

పాడేరురూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వెలుగు యానిమేటర్స్ (వీవోఏ)ల జిల్లా నూతన కార్యవర్గాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బీ పోతురాజు సమక్షంలో ఎన్నుకున్నట్టు సీఐటీయూ సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు తెలిపారు. శనివారంవీవోఏల రెండవ మహాసభ ముగింపు అనంతరం నిర్వహించిన ఈఎన్నికల్లో జిల్లా అధ్యక్షురాలిగా ఆర్.భాను (పాడేరు), ఉపాధ్యక్షుడిగా భాస్కరరావు (డుంబ్రిగుడ), కార్యదర్శిగా ఎల్‌బీ రాజుకుమార్ (అరకు), సహాయ కార్యదర్శిగా జ్యోతి (ముంచంగిపుట్టు), కోశాధికారిగా పోతురాజు (హుకుంపేట), కమిటీ సభ్యులుగా పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలిలకు చెందిన రవి, చిన్నిబాబు, సూరిబాబు, దుర్గాదేవి, రాజు, మహేశ్, సువర్ణ, శోభన్, మల్లేష్, దుర్గలను ఎన్నుకున్నారు.

కొయ్యూరు సీఐగా శ్రీనివాసరావు



సీఐగా నియమితులైన శ్రీనివాసరావు

కొయ్యూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు సీఐగా సోషల్ మీడియా సైబర్ నెట్‌లో పనిచేస్తున్న బొమ్మిడి శ్రీనివాసరావును నియమించారు. శుక్రవారం విశాఖ రేంజ్ పరిధిలో డీఐజీ గోపినాథ్ జెట్టి 12 మంది సీఐలకు స్థానచలనం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరిలో కొయ్యూరులో గత రెండున్నర ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణను సోషల్ మీడియా సైబర్ నెట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీనివాసరావును నియమించారు.శ్రీనివాసరావు 2017లో కొయ్యూరు ఎస్ఐగా పనిచేశారు.

బాలికా విద్యపై ప్రత్యేక చొరవ



మాట్లాడుతున్న వాసవ్య మహిళా మండలి ప్రోగ్రాం డైరెక్టర్

చింతపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని వాసవ్య మహిళా మండలి ప్రోగ్రాం డైరెక్టర్ సునీత రాణి అన్నారు. శనివారం వంగసార, చింతపల్లి జడ్పీ కాంప్లెక్స్‌లలో బాలికల సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రోగ్రాం డైరెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో బాలికల డ్రాపౌట్‌లు అధికంగా ఉన్నాయన్నారు. బాలికలను యుక్త వయస్సులోకి రాగానే బాల్య వివాహాలు చేస్తున్నారన్నారు. వాసవ్య మహిళా మండలి ద్వారా బాల్య వివాహాలను అడ్డుకోవడంతోపాటు వాటితో కలిగే నష్టాలను బాలికలు, తల్లిదండ్రులకు వివరిస్తున్నామన్నారు. బాలికలు బడికి దూరం కాకుండా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. డ్రాపౌట్ విద్యార్థుల సమాచారం తమకు అందజేస్తే తల్లిదండ్రులతో చర్చించి తిరిగి పాఠశాలలో చేర్పించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడంనాయుడు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, లక్ష్మణరావు, వాసవ్య మహిళా మండలి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారిగా గిరిబాబు



గూడెంకొత్తవీధి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారిగా డి. గిరిబాబు బాధ్యతలు స్వీకరించారు. గతనెలలో జరిగిన బదిలీల్లో స్థానికంగా పనిచేసిన ఏవో మధుసూదనరావు చింతపల్లి వెళ్లారు. ఆయన స్థానంలో ఇంతవరకు ఎవరిని నియమించలేదు. దీంతో మధుసూదనరావు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా విజయనగరం నుంచి గి రిబాబుని జీకే వీధి బదిలీచేయడంతోఆయన బాధ్యతల్లో చేరారు.

ఎరువుల కొరతతో సతమతం

▸▸ సరిహద్దులోని ఒడిశాకు పరుగు



డుంబ్రిగుడలో దుకాణం వద్ద రైతులు నిరీక్షణ

డుంబ్రిగుడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో ఈ సమస్య వీడడంలేదు. దీంతో మండలంలో పలు గ్రామాల్లో ఖరీఫ్ సాగు చేసిన గిరిజన రైతులు ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ, రైతు భరోసా కేంద్రాల్లో, ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువులు అందుబాటులోలేక గిరిజనులు ఆందోళనకు గురవుతున్నారు. తప్పని పరిస్థితుల్లో పక్కనున్న ఒడిశాకు వెళ్లాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రైతులకు సరిపడే యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నారు. మండ కేంద్రంలోని వారపు సంతలో ప్రైవేట్ డీలర్ వద్దకు మారుమూల గిరిజన రైతులు వస్తున్నారు. ఇక్కడా ఎరువులు లేకపోవడంతోనిరాశతో వెనుదిరిగారు. సరిహద్దులో ఉన్న ఒడిశా లోని గ్రామాల్లోకి వెళ్లి యూరియాను అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం సంబధించి యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధారకొండలో యూరియా అధిక ధరలకు విక్రయం

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండలో ఖరీఫ్ సాగుకు అవసరమయ్యే యూరియా బస్తాలను వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని గిరిజన సంఘం మండల నాయకుడు పాంగి నాగేశ్వరరావు ఆరోపించారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాట్లు పూర్తవడంతో ప్రస్తుతం యూరియా వేయాల్సి ఉందని, దీని కొనుగోలుకు గిరిజన రైతులు షావుకార్ల దగ్గరకు వెళితే నర్సీపట్నంలో రూ. 450కు విక్రయించే యూరియా బస్తా ధారకొండలో రూ. 950కు అమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అధిక ధరలకు కొనలేకపోతున్నామని వాపోయారు. వరికి యూరియా వేయకుంటే పంట పాడైపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికార్లు స్పందించి యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

సినిమా షూటింగ్ కోసం స్థల పరిశీలన



సీలేరు మార్కెట్‌లో పరిశీలిస్తున్న సినీ డైరెక్టర్ శివ నిర్వాణ బృందం

సీలేరు, ఆగస్టు 30 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో సినిమా షూటింగ్‌కు అనుకూలమైన ప్రదేశాలను శనివారం ప్రముఖ డైరెక్టర్ శివ నిర్వాణ తన బృందంతో కలసి పరిశీలించారు. ఇటీవల సీలేరు కాంప్లెక్సు పరిధిలోని మోతుగూడెం, డొంకరాయి, సీలేరు పరిసర ప్రాంతాల్లో అగ్ర హీరోలు నటించిన పుష్ప, పుష్ప 2, , అఖండ తదితర సినిమాలు చిత్రీకరించారు. ఈ సినిమాలు సూపర్ హిట్ కావడం తోపాటు ఇ క్కడ సుందరమైన సహజసిద్ధ దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నిన్ను కోరి, మజిలీ, టక్ జగదీశ్, ఖుషి తదితర సూపర్ హిట్ సినిమాలను తీసిన యువ డైరెక్టర్ శివ నిర్వాణ తాజాగా రవితేజతో తీయనున్న సినిమా కోసం సీలేరులో అనుకూలమైన ప్రదేశాలను పరిశీలించారు. అయ్యప్పస్వామి ఆలయం, సీలేరు మార్కెట్, రామాలయం సెంటర్, ఏపీ జెన్‌కో గెస్ట్‌హౌస్, ఎస్‌ఈ బంగ్లా తదితర ప్రాంతాలను పరిశీలించి వీడియోలను తీసుకున్నారు. ఈ ప్రదేశాలను స్థానిక బాలాజీ రెసిడెన్సీ యజమాని నక్కా బాల, కారే శ్రీ నివాస్ ఈ బృందానికి చూపించారు. నవంబర్‌లో ఇక్కడ షూటింగ్ ప్రారంభించనున్నట్టు యువ డైరెక్టర్ శివ నిర్వాణ తెలిపారు.

ఆస్పత్రుల్లో పారిశుధ్య కార్మికుల వినతి



ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు వినతిపత్రమిస్తున్న కార్మికులు

పాడేరురూరల్, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): జిల్లా పరిధిలోని వివిధ ప్రభ త్వ ఆస్పత్రులలో ప నిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ టి.నరసింగరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి లింగేటి సుందరరావు మాట్లాడుతూ ఆస్పత్రి పారిశుధ్య కార్మికులకు 2024 నవంబర్‌లో పెంచిన కొత్త వేతన జీవోను వెంటనే అమలు చేసి ఏరియర్స్ చెల్లించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలులో తప్పిదాలను సరిచేయాలని, ప్రతినెలా మొ దటి వారంలో వేతనాలు చెల్లించాలని, వేతనంతో కూడిన 9 జాతీయ సెలవులను ఇవ్వాలన్నారు. పేస్ట్ కంట్రోల్, ఎస్ఎంసీ, ఎన్ఆర్‌సీ, క్యాంటీన్, బర్త్ వెయిటింగ్ విభాగాలలో కార్మికులను నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ ప్రకారం సూపర్‌వైజర్ పోస్టులు ఇవ్వాలని, షిఫ్ట్ డ్యూటీలు వేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఆస్పత్రి పారిశుధ్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్.ముత్యాలమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పుణ్యవతి, భూషణ్, చిట్టిబాబు, నగేశ్, పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలకు కృషి : ఏపీసీ



చిలకలగెడ్డలోని క్లస్టర్ సమావేశాన్ని పరిశీలిస్తున్న ఏపీసీ డాక్టర్ స్వామినాయుడు

అనంతగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో ప్రాథమిక స్థాయిలో విద్యాప్రమాణాలను మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు బోధన ఉండాలని ఎస్ఎస్ఏ పీవో, ఏపీసీ డాక్టర్ స్వామి నాయుడు సూచించారు. మండలంలోని చిలకలగెడ్డ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని క్లస్టర్ సమావేశాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్ఞానధార, ఎఫ్ఎల్ఎన్, తరల్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ అంశాలన్నీ ప్రాథమిక పాఠశాలలోని పక్కాగా అమలుచేసి, విద్యాప్రమాణాలను మెరుగుపరచాలన్నారు. అకింతభావంతో పనిచేస్తే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తోందని, విద్యార్థి ఉన్నతికి కృషి చేయాలన్నారు. ఏడాది భోదించాల్సిన పాఠ్యాంశాల షెడ్యూల్ ప్రకారం తూచా తప్పకుండా పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ ఎం ఎస్. సైమన్, ఉపాధ్యాయులు నరాజీ మల్లేశ్వరరావు, శెట్టి రాంబాబు, శేఖర్, గుప్తా, పరశురామ్, సీఆర్పీ గణేశ్,పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రాము

పాడేరురూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ కోర్టులో వచ్చే నెల 13వ తేదీ శనివారం నిర్వహించ నున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పెండింగ్‌లో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని స్థానిక జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎ. రాము సూచించారు. శనివారం ఆయన స్థానిక కోర్టు ఆవరణలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన పోలీస్ అధికారులు, న్యాయవాదులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించి కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు సీఐ డి.దీనబంధు, పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన ఎస్ఐలు ఎల్.సురేశ్, ఎ.సూర్యనారాయణ, ఎస్.షణ్ముఖరావు, కె.రమణ, జె.రామకృష్ణ, పాడేరు ఎక్సైజ్ ఎస్ఐ పి.లక్ష్మీ, న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు గంబూషియా చేపలు విడుదల



చెరుపీధిలో నీటి కుంటల్లో గంబూషియా చేపలు విడుదల చేస్తున్న వైద్యాధికారి నిఖిల్, సిబ్బంది

పెదబయలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కీటక జనిత వ్యాధుల నివారణకు స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అరడకోట, సీకరి పంచాయతీలలోని నీటి కుంటల్లో (చెరువులు) గంబూషియా చేపలను విడుదల చేసినట్లు వైద్యాధికారి నిఖిల్ తెలిపారు. దోమల నియంత్రణకు చెరువీధి, బంగారుమెట్ట గ్రామాల్లో చెరువుల్లో గంబూషియా చేపలు విడిచిపెట్టారు. . ఈ చేపలు దోమల గుడ్లు, లార్వాలను తిని మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను వ్యాప్తి చెందకుండా అరికడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేశ్వరరావు, సిబ్బంది వి.ఎస్. మూర్తి, పౌల్, సరోజిని, ఆదివాసీ సేవా సంఘం కన్వీనర్ మంజుబాబు, వార్డు సభ్యులు శ్యామల పాల్గొన్నారు.

చింతపల్లి: లార్వా దశలోనే దోమలను నియంత్రించేందుకు గంబూషియా చేపలను చెరువులు, పాడుబడ్డ బావుల్లో వేస్తున్నట్టు స్థానిక మలేరియా సబ్ యూనిట్ అధికారి బుక్కా చిట్టిబాబు తెలిపారు. శనివారం పలు పీహెచ్‌సీల పరిధిలోనున్న చెరువులు, పాడుబడ్డ బావు ల్లో ఈచేపలను విడిచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు చెరువులు, పాడుబడ్డ బావుల్లో లార్వాను అభివృద్ధి చేస్తుందన్నారు. దీంతో దోమల సంఖ్య పెరిగిపోతుందన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం వీటి నిరోధానికి గంబూషియా చేపలను పంపించినట్టు చెప్పారు. ఈచేపలు దోమల లార్వాను ఆహారంగా తీసుకుంటుందని, దీంతో దోమల ఉధృతి తగ్గుతుందన్నారు. లంబసింగి, తాజంగి, లోతుగెడ్డ, కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గుర్తించిన పాడుబడ్డ బావులు, చెవుల్లో గంబూషియా చేపలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎస్ గుమ్మ యుగంధర్ పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో రక్షణ గోడలు లేక ప్రమాదాలు



కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డు పరిశీలిస్తున్న అర్జున్ రెడ్డి తదితరులు

జి.మాడుగుల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జి.మాడుగుల-చింతపల్లి రహదారిలో కొక్కిరాపల్లి మలుపు రోడ్డుకు ఇరువైపులా శిథిలమైన రక్షణ గోడలు పునర్నిర్మించాలని సామాజిక సేవా కార్యకర్త అర్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన బృందం రహదారిని పరిశీలించారు. ఈ మార్గంలో చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, సీలేరు తదితర ప్రాంత ప్రజలు నిత్యం పాడేరు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారన్నారు. రక్షణ గోడలు లేక ప్రమాదాలకు గురువుతున్నారని, తక్షణమే ఈ మలుపుల్లో రక్షణ గోడలు నిర్మాణాలు చేపట్టాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు.

వైన్‌షాప్ సీజ్

కొయ్యూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రపాలెం కేంద్రంగా నిర్వహిస్తున్న కొయ్యూరు మద్యం షాపును ఎక్సైజ్ శాఖాధికారులు సీజ్ చేశారు. ఈషాపులో మద్యం లావాదేవీలకు సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహించక పోవటంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్టు సంబంధిత శాఖాధికారులు తెలిపారు.

శ్రమదానంతో రహదారి నిర్మాణం



పేత్రాయి నుంచి ఒడిశా సరిహద్దు వరకు రోడ్డు నిర్మిస్తున్న గిరిజనులు

సీలేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలో నిపేత్రాయి గ్రామం నుంచి సరిహద్దుల్లోని ఒడిశాను కలిపే ఒక కిలో మీటర్ రహదారిని గిరిజనులు శ్రమదానంతో పాటు విరాళాలుగా చేకూర్చున్న డబ్బుతో నిర్మిస్తున్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో ఉన్న పేత్రాయి గ్రామం తోపాటు మరో సుమారు 10 గ్రామాలకు పైగా గిరిజనులు ఒడిశాలోనిచిత్రకొండకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు కిలో మీటర్ రహ దారి సక్రమంగా లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత గిరిజనులు సొంతంగా డబ్బులు చందాలు వేసుకుని, శ్రమదానంతో రహదారిని నిర్మిస్తున్నారు. రాకపోకలకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి: డీఈవో



సమావేశంలో పలు సూచనలు ఇస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

పెదబయలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలని డీఈవో పి. బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. శనివారం మండలంలో జరిగిన పలు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన సందర్శించారు. ప్రాథమిక స్థాయి తరగతి గదిలో అనుసరించాల్సిన బోధన పద్ధతులు, సంబంధిత ఉపకరణాలను తయారు చేసుకుని ప్రదర్శనగా ఉంచాలన్నారు. నూతన బోధనా పద్ధతులకు ఈ సమావేశాలు దోహదపడతాయని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని చిన్నారులను ప్రతిభా వంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ త్రినాధరావునాయుడు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో భాగంగా పీ-4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాల దత్తతకు సంబంధించి ప్రభుత్వం శాఖలకు బాధ్యతలు అప్పగించించినట్టు చెప్పారు. ఎంపికైన వివిధ వర్గాల ద్వారా బంగారు కుటుంబాలకు సాయం అందించేలా 24 శాఖలు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 పుష్పజోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

గోమంగిని మండలంగా ప్రకటించాలని ర్యాలీ



ర్యాలీ చేస్తున్న మండల సాధన సమితి ప్రతినిధులు, గిరిజనులు

పెదబయలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గోమంగిని ప్రత్యేక మండలంగా ప్రకటించాలని గ్రామంలో మండల సాధన సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం 17 పంచాయతీల ప్రజాప్రతినిధులు, గిరిజనులు సమావేశమయ్యారు. కేంద్రబిందువుగా ఉన్న గోమంగిని మండలంగా ప్రకటిస్తే పరిసర పంచాయతీల ప్రజలకు పౌరసేవలు సులువుగా అందుతాయని పేర్కొన్నారు. రెవెన్యూ సర్వే ప్రకారంగా గోమంగిని మండలం ఏర్పాటుకు అర్హతలన్నీ ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం పెదబయలు మండల కేంద్రానికి పౌరసేవల కోసం వెళ్లాలంటే సుమారు 45 నుండి 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. శివారు గ్రామాల గిరిజనులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అందువల్ల 17 పంచాయితీలకు అనువుగా ఉన్న గోమంగిని ప్రత్యేక మండలంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మండల సాధన సమితి నాయకులు ఉమామహేశ్వరరావు, రాధాకృష్ణ, బొంజుబాబు, సూర్యనారాయణ, సింహాచలం, అనంతపద్మనాభం, బాలరాజు, మత్స్యకొండబాబు, కళ్యాణం, చిట్టిబాబు, భాస్కరరావు, సత్తిబాబు, జమ్మనాయుడు, ధనుంజయ్, నవీన, ప్రసాద్, అప్పన్న, పెద్దరావు, గిరిజనులు పాల్గొన్నారు.

డీఎల్ పీఆర్‌వో రాము సేవలు భేష్: కలెక్టర్



డీఎల్ పీఆర్‌వో రాములును సత్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ అంకితభావంతో డివిజనల్ పౌర సంబంధాల అధికారి పి.రాములు ఉత్తమ సేవలను అందించారని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. పదవీవిరమణ పొందిన ఆయన్ని శనివారం తన చాంబర్‌లో శాలువ కప్పి కలెక్టర్ సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు, మీడియా సమన్వయంలో చురుకైన పాత్ర పోషించి ఆదర్శవంతమైన సేవలు అందించారన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కేబీఎం సింగ్ మాట్లాడుతూ... 1995లో సమాచార శాఖలో పబ్లిసిటీ అసిస్టెంటుగా చేరి డివిజనల్ పీఆర్‌వో స్థాయికి ఎదిగిన రాములు విధి నిర్వహణలో ఆదర్శవంతంగా వ్యవహరించారన్నారు. పనిచేసిన ప్రతి చోటా ఉత్తమ అధికారిగా గుర్తింపు, అవార్డులు పొందారని, 30 ఏళ్ల సర్వీసులో ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఆర్‌వో రాములు మాట్లాడుతూ అధికారులు, మీడియా సహకారంతో చక్కని సేవలు అందించానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ కె.సంధ్యారాణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీకే వీధి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా నూకరాజు



పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన నూకరాజు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) ఛైర్‌పర్సన్‌గా మొట్టం నూకరాజుని నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దేవరాపల్లి గ్రామ పంచాయతీ కొట్నాపల్లి చెందిన నూకరాజు టీడీపీలో సీనియర్ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఈ నామినేటెడ్ పదవిని కేటాయించింది. అలాగే జీకేవీధికి చెందిన మాజీ టీడీపీ మండలాధ్యక్షుడు ముక్కలి రమేశ్, పెదవలస గ్రామ పంచాయతీకి చెందిన రీమల పౌల్ కుమార్ డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

రుణాలు అప్‌డేట్ చేసుకోవాలి: ఛైర్‌పర్సన్

చింతపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్)లో రుణాలు తీసుకున్న రైతులు ఏడాదికి ఒకసారి వివరాలు ఆప్‌డేట్ చేయించుకోవాలని ఛైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీఏసీఎస్ పరిధిలో 623మంది రైతులు రుణాలు తీసుకున్నారన్నారు. రైతులు విడతల వారీగా రుణాలను చెల్లిస్తున్నారన్నారు. రైతులు తీర్చిన రుణం, ఎంత బకాయి ఉన్నదనే వివరాలు ఏటా తెలుసుకోవాలన్నారు. రుణాలు తిరిగి చెల్లించిన రైతులు కొత్త రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సుర్ల అప్పలకొండ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



ఊరేగింపులో ధింసా నృత్యం చేస్తున్న మహిళలు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. శనివారం పలుచోట్ల వినాయక మండపంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం వినాయక ఊరేగింపు ప్రారంభమైంది. మహిళలు పెద్ద సంఖ్యలో గిరిజన సంప్రదాయ థింసా నృత్యం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం స్థానిక వాగు వద్ద నిమజ్జనం చేశారు.కార్యక్రమంలో నిర్వాహకులు గంటా మురళీకృష్ణ, లక్కోజు సుబ్రహ్మణ్యం, కామేశ్వరరావు, పి. శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

తోటలూరులో అన్న సమారాధన

కొయ్యూర: గణేష్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించి తోటలూరు గ్రామంలో శనివారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మందికిపైగా పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ అర్చకుడు మాదల ప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కాకురు చంద్రరావు, సర్పంచ్ లక్ష్మి సమకూర్చిన బహుమతులను విజేతలకు అందచేశారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి

నర్సీపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును న్యాయమూర్తి పి.షియా జ్ఖాన్ శనివారం సందర్శించారు. జైలులో సౌకర్యాలు, భోజన సదుపాయలు, రిమాండ్ ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలిసుకున్నారు. ఎంతకాలంగా రిమాండ్‌లో ఉన్నారని ప్రశ్నించారు. న్యాయ సహాయం కావాలంటే అందిస్తామని ఆయన తెలిపారు.

పెద్దేరు జలాశయం నుంచి 250 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయంలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు వచ్చి చేరుతుండడంతో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. కాగా శనివారం సాయంత్రానికి 395 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.3 మీటర్లకు చేరింది. దీంతో రాత్రి తొమ్మిది గంటలకు జలాశయం మూడో నంబరు గేటు తెరిచి 250 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టినట్టు జలాశయం ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. పెద్దేరు వాగు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

అట్రాసిటీ కేసులపై అవగాహన

నర్సీపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ కేసులపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వీటితో పాటు బాల్య వివాహాల నిరోధంపై న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు శివనారాయణరాజు, ప్రిన్సిపాల్ శోభ అవగాహన కల్పించారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- అభివృద్ధి పనులపై చర్చకు సై అంటే సై
- టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల వాగ్వాదం
- మునిసిపాలిటీలో రెండు ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- పారిశుధ్యం, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచన





కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ... సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ పద్మావతి

నర్సీపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధమని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చాలెంజ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు ఇరు పార్టీల కౌన్సిలర్లు సై అంటే సై అనుకున్నారు. గత ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిన్నర కాలంలో మునిసిపాలిటీకి మంజూరైన నిధులు, జరిగిన అభివృద్ధి అంశంపై తేదీ, సమయం చెబితే చర్చించుకుందామని చాలెంజ్ చేసుకున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి వ్యక్తిగత కారణాలతో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి రాకపోవడంతో, ఆమె స్థానంలో వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అజెండాలోని 13 అంశాలను సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి చదివి వినిపించారు. కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ అజెండాలోని ఒక్కొక్క అంశం మీద చర్చించి ముందుకు వెళదామని సూచించారు. దీనికి టీడీపీ కౌన్సిలర్ పద్మావతి అభ్యంతరం వ్యక్తం చేశారు. మొత్తం అజెండా చదివిన తర్వాత అన్ని అంశాలపై అభ్యంతరాలు ఉంటే ఒకేసారి చర్చించి తీర్మానం చేసుకోవచ్చునని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా పడుతున్నందున ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారని, వార్డులలో దోమల బెడద నివారణకు, పారిశుధ్యం మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. వార్డులలో అవగాహన ర్యాలీలు నిర్వహించి పారిశుధ్య, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలలో చైతన్యం తీసుకు రావాలని చెప్పారు. గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రధాన రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా చేపట్టారని విమర్శించారు. రూ.16 కోట్లతో పనులు ప్రారంభించి ఒక్క పైసా కూడా విడదల చేయలేదన్నారు. అలాగే నాణ్యత లేని పనులు చేపట్టారని ఆరోపించారు. వైసీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంజూరు చేయించిన వీఎంఆర్డీఏ నిధులతో కొత్త రోడ్లు మాత్రమే వేస్తారా, రోడ్లు మరమ్మతులు కూడా చేస్తారా? అని ప్రశ్నించారు. కమిషనర్ సరేంద్ర మాట్లాడుతూ రూ.4.11 కోట్ల నిధులతో వార్డులలో పనులు జరుగతున్నాయని తెలిపారు. ఈ అంశంపై టీడీపీ కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వార్డులో డ్రైనేజీ కావాలని, విద్యుత్ స్తంభం వేయించాలని అడిగితే చేయించలేకపోయారని విమర్శించారు. ప్రజలకు కావాల్సిన పనులు అడిగి చేయించుకోవాలి తప్పితే వ్యంగ్యంగా మాట్లాడటం సరికాదన్నారు. కౌన్సిలర్ బుల్లిదొర మాట్లాడుతూ తాను అటువంటి ఉద్దేశంతో మాట్లాడలేదన్నారు. పెదబొడ్డేపల్లి జంక్షన్‌లో చోడవరం రోడ్డు బాగా పాడైందని, బాగు చేయించడానికి వీలు పడుతుందన్న ఉద్దేశంతో మాట్లాడానని చెప్పారు. 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ రోడ్డును మునిసిపాలిటీ ఎందుకు మరమ్మతులు చేయిస్తుందని ప్రశ్నించారు. ఈ అంశంపై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో గత ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిన్నర కాలంలో మునిసిపాలిటీకి మంజూరైన నిధులు, జరిగిన అభివృద్ధి అంశంపై తేదీ, టైము చెబితే చర్చించుకుందామని వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు చాలెంజ్ చేసుకున్నారు. రెండో వార్డులో వీధి లైట్లు పనిచేయడం లేదని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని కౌన్సిలర్ సిరపల్లి నాని తెలిపారు. రోడ్డు మంజూరైనా 15 నెలలుగా ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. నాలుగో వార్డులో తాగునీటి ట్యాంకు శిథిలావస్థలో ఉందని కౌన్సిలర్ దాడి కృష్ణవేణి చెప్పారు. 22వ వార్డు పరిధిలోని సచివాలయంలో ప్రింటర్లు పనిచేయడం లేదని కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. పెదబొడ్డేపల్లి 6వ సచివాలయం పరిధిలో రెండు వార్డులకు ముగ్గురు పారిశుధ్య సిబ్బంది ఉన్నారని, దీనివల్ల చెత్త సేకరణ, కాలువల శుభ్రత కొరవడిందని 11 వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం తెలిపారు. దోమల నివారణకు పిచికారీ చేయించాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆమె తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక

గొలుగొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజావేదిక నిర్వహించారు. పలు గ్రామాల్లో భూ సమస్యలపై రైతులు గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇరు వర్గాలతో సమావేశం ఏర్పాటుచేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బాబూరావు, ఏఎస్ఐ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కోర్టుకు స్థల పరిశీలన

మాకవరపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాలీబాల్ కోర్టు ఏర్పాటుకు రెండు చోట్ల స్థలాలను పరిశీలించామని ఇన్‌చార్జి ఎంపీడీవో మేరీజోన్స్ చెప్పారు. మండల కేంద్రంలోని కొత్తవీధిలో సర్వే నంబరు 68లోని ప్రభుత్వ స్థలాన్ని శశనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు వేల మంది జనాభా ఉన్న రెండు గ్రామాల్లో వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం స్థలాలను గుర్తిస్తున్నామన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.5 లక్షలతో వాలీబాల్ కోర్టు నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో కాశీ, పంచాయతీ కార్యదర్శి బాలదొర, ఉప సర్పంచ్ లాలం రాము పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం రేపు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని పాతకృష్ణాదేవిపేట సోమవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు జనసేన పార్టీ మండల నాయకుడు దుంపలపూడి సహదేముడు తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు. రక్తదానం చేయదల్చిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముందుగా తమ పేర్లను 9182528415, 6309565689 నంబర్లకు ఫోన్ చేసి పేర్ల సమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లంక సత్యనారాయణ, ప్రసాద్, శివాజీ, చిన్ని, గోపి, శివ పాల్గొన్నారు.

సక్రమంగా ఎరువులు అందించండి

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న ఎరువులకు రైతులకు సక్రమంగా అందించాలని జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ సూచించారు. ధర్మసాగరం రైతు సేవా కేంద్రంలో శనివారం ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్‌లో రైతులకు ఎరువుల కొరత లేదన్నారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి ఎం.శ్రీనివాస్, డీఎల్‌డీవో నాగలక్ష్మి, ఏవో విజయలక్ష్మి, తహశీల్దార్ రామారావు, ఎంపీడీవో ఉషశ్రీ, రూరల్ సీఐ రేవతమ్మ ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని పరిశీలించారు.

2న జనసేన కార్యాలయం ప్రారంభం

నాతవరం, ఆగష్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వచ్చే నెల 2న జనసేన నూతన కార్యాలయాన్ని ప్రారంబిస్తామని పార్టీ మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమానికి నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి, రాష్ట్ర బీసీ కార్పోరేషన్ డైరక్టర్ రాజాన వీరసూర్యచంద్రతో పాటు జిల్లా నాయకులు హాజరవుతారని చెప్పారు.

దివ్యాంగ క్రీడాకారులకు సన్మానం

రావికమతం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్ పోటీల్లో గెలుపొందిన ఇద్దరు మనోవైకల్య క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. అనకాపల్లి వీవీ రమణ రైతు భారతి కేంద్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన నారా లోకేష్ యువ కిరణాలు-25 కార్యక్రమంలో భాగంగా మండలానికి చెందిన దివ్యాంగ క్రీడాకారులు అప్పికొండ గణేశ్, నక్కరాజు బాల సరస్వతిలను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి దాడి రత్నాకర్, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ దాడి జయవీర్, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు వి.నారాయణరావు, సీనియర్ పవర్ లిఫ్టర్ కె.అప్పలనాయుడు సత్కరించారు. వీరికి కోచ్‌గా వ్యహరించిన మహాలక్ష్మినాయుడును అభినందించారు.

విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఆదివాసీల నిరసన

రావికమతం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు కట్టలేదని కనెక్షన్ కట్ చేసిన విద్యుత్ శాఖ అధికారుల తీరుకు నిరసనగా డోలవానిపాలెం ఆదివాసీలు శనివారం రావికమతం సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ బిల్లు కట్టడానికి గడువు కావాలని కోరినా వినకుండా లైన్‌మన్ కనెక్షన్లు తొలగించారన్నారు. దీంతో అడవిని ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో ఆదివాసీలు రాత్రంతా చీకటిలోనే బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వచ్చిందని వాపోయారు. రెండు బల్బులు, ఒక ఫ్యాన్ ఉన్న ఇంటి నెలకు 200 యూనిట్లు మించి బిల్లు ఏ విధంగా వచ్చిందని ఆయన ప్రశ్నించారు. తక్షణమే కరెంట్ కనెక్షన్లును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈఈ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ సమావేశానికి తరలిరండి

నర్సీపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చే నెల జరగనున్న ఓబీసీ కాంగ్రెస్ కార్య నిర్వాహక సమావేశానికి కార్యకర్తలు తరలిరావాలని కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ కోరారు. సమావేశంలో బీసీలు, ఓబీసీల సమస్యలపై చర్చించి న్యాయ జరిగేలా నిర్ణయం తీసుకోవడం జరుగుతందన్నారు. రానున్న ఎన్నికలలో బీసీలకు ప్రాతినిధ్యం ఇచ్చేలా చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి పీసీపీ అధ్యక్షురాలు షర్మిల హాజరవుతారని తెలిపారు.

నాలుగు భూ సమస్యలపై విచారణ



భూ సమస్యలపై విచారణ చేపడుతున్న మండల అధికారులు

మాకవరపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినరాచపల్లి, రామన్నపాలెం, కొండల అగ్రహారం, అరప్పాఅగ్రహారం గ్రామాల్లో భూ సమస్యలపై వచ్చి ఫిర్యాదులపై శనివారం విచారణ చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లోని నాలుగు భూ సమస్యలపై పూర్తిస్థాయి విచారణ చేసి తగిన న్యాయం చేస్తామని మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు తెలిపారు. మండలంలోని పీజీఆర్ఎస్‌లో ఐదు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో ఒక ఫిర్యాదును సోమవారం నాటికి వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.వెంకటరమణ, ఎంపీడీవో మేరీ జోన్స్, డీటీ నూకరాజు, ఆర్ఐ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



పీఎస్ పేటలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎస్ పేట లక్ష్మీ గణపతి ఆలయంలో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉత్సవాల నాలుగో రోజు శనివారం ఆలయ చైర్మన్ పుల్రేవు శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు అరసవెల్లి శేషసూర్య గోపాలాచార్యులు, నరసింహాచార్యులు పర్యవేక్షణలో లక్ష్మీగణపతి హోమంతో పాటు గణేశ మాలధారణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పనిచేసేది ఇద్దరు.. పర్యవేక్షకులు ఏడుగురు!



జి.కొత్తపల్లిలో ఇద్దరు కార్మికులు చేస్తున్న పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

చీడికాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా జి.కొత్తపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం అధికారులు డ్రైనేజీలు పరిశీలించారు. అయితే ఇక్కడ ఇద్దరు పారిశుధ్య కార్మికులు పని చేస్తుంటే, వారిని ఏగుడురు అధికారులు పర్యవేక్షించడం విశేషం. మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్.మూర్తి, ఎంపీడీవో హేమసుందర్రావు, తహశీల్దార్ కిశోర్‌లింకన్, డిప్యూటీ ఎంపీడీవో సిహెచ్.చంద్రశేఖరరావు, ఏవో కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి వారిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలనే అంశంపై కార్మికులకు వారు అవగాహన కల్పించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



గ్రోమోర్ దుకాణం తనిఖీ చేస్తున్న అధికారులు

దేవరాపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని రెండు ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను విజిలెన్స్ ఎస్ఐ రవి కుమార్, వ్యవసాయ అధికారి కాంతమ్మ శనివారం తనిఖీలు చేశారు. గ్రోమోర్ షాపులో తనిఖీలు చేసి బిల్లు పుస్తకాలను పరిశీలించారు. పుస్తకంలో (జూలై 8న ఇచ్చి జూలై 9న) ఇచ్చిన రోజు రాయకుండా మరో రోజు నమోదు చేయడంతో సిబ్బందిపై విజిలెన్స్ అధికారులు నోటీసు ఇచ్చారు. సురేశ్ జనరల్ స్టోర్‌ను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా ఉన్నాయన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై రైతులు ఆందోళన చెందొద్దు

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియాపై రైతులు ఆందోళన చెందనక్కర్లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో గంగవరం పోర్టుకు 10.350 టన్నుల ఎరువులు వచ్చాయని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎరువుల డీలర్లు కృత్రిమ కొరతను సృష్టిస్తూ రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారని, దీన్ని ప్రధానంగా వైసీపీ దుష్ప్రచారానికి తెర లేపిందని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, సెప్టెంబరులో రావాల్సిన యూరియా ముందుగానే రాష్ట్రానికి రప్పించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని చెప్పారు. సోమవారం నుంచి రైతులకు అవసరం మేరకు యూరియా సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం రైతులు వరి పంట ఎన్ని హెక్టార్లలో పండిస్తున్నారో అధికారులు వద్ద లెక్కలు ఉన్నాయన్నారు. వరి పండించిన ప్రతీ రైతుకు యూరియా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పోలీస్, విజిలెన్స్, అగ్రి విజిలెన్స్‌తో నిరంతరంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఎరువులు డీలర్లు అత్యాశకు పోయి అధిక ధరలకు అమ్మితే కేసులు నమోదు చేయడమే కాకుండా వారి లైసెన్సులు రద్దు అవుతాయని ఎమ్మెల్యే హెచ్చరించారు. అలాగే సెప్టెంబరు ఒకటిన అర్హత ఉన్న దివ్యాంగులందరికీ పింఛన్లు వస్తాయన్నారు. దొంగ సర్టిఫికెట్లతో ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న వారిని మాత్రమే తొలగించడం జరుగుతుందన్నారు. దీనిపై దివ్యాంగులు ఆందోళన చెందనక్కర్లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ పూర్ణిమాదేవి, తహశీల్దార్ భుజంగరావు, ఎంపీడీవో సాంబశివరావు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేశ్, నాయకులు జూరెడ్డి రాము, దాడి ఎరుకునాయుడు, పూడి నారాయణమూర్తి, చీపురుపల్లి రామారావు, కన్నూరు సూర్యనారాయణ, వెలగల పైడమనాయుడు, బొడ్డు అక్కునాయుడు, పూడి శ్రీను, వి.శ్రీను పాల్గొన్నారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ



కలిగొట్లలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

దేవరాపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగొట్ల గ్రామంలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య అనే ఆయుధంతో ఏదైనా సాధించవచ్చని అంబేడ్కర్ నిరూపించారన్నారు. ప్రపంచ దేశాల్లో భారత దేశ ఖ్యాతిని చిరస్థాయిగా నిలిపిన అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయులని పేర్కొన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రపంచంలోని వంద దేశాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తారని, బాబూ జగ్జీవన్‌రామ్ 40 సంవత్సరాలు పార్లమెంటు సభ్యునిగా చేశారని చెప్పారు. అంతటి మహానుబావుల విగ్రహాలు పెట్టిన అంబేడ్కర్ సాధన కమిటీ సభ్యులు అందరికీ స్ఫూర్తిగా నిలిచారని అభినందించారు. ఈ కార్యక్రమంలోజలాశయ చైర్మన్ పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, దొగ్గ దేమున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కాల పరిమితిని మూడు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వుల జారీ అయినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి నవంబరు వరకు పొడిగించినట్లు ఆమె తెలిపారు. కొత్త కార్డుల జారీ ప్రక్రియ ఈ గడువులోగా చేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. మీడియా సంస్థలు ప్రస్తుత అక్రిడిటేషన్ కలిగి ఉన్న తమ జర్నలిస్టుల జాబితాను సెప్టెంబరు ఐదో తేదీలోగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి అందించాలని ఆమె తెలిపారు.

విద్యార్థులకు దోమతెరల పంపిణీ

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్సి యల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ విజయకృష్ణన్ శని వారం దోమ తెరలను పంపిణీ చేశారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యాధులు ప్రబలకుండా దోమల తెరలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీవో జి.రామారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత ధరలకే ఎరువులు విక్రయించండి



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

చీడికాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని మండల ప్రత్యేకాధికారి కేవీఎల్ఎన్.మూర్తి ఆదేశించారు. చీడికాడలోని ఓ ప్రైవేట్ ఎరువుల కేంద్రాన్ని, శిరిజాం రైతు సేవా కేంద్రాన్ని శనివారం మధ్యాహ్నం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, ఎరువులు ఎంతకి అమ్ముతున్నారనే రికార్డులను పరిశీలించారు. అలాగే శిరిజాం గ్రామంలో రికార్డులను తనిఖీ చేశారు. గోదాముల్లో నిల్వలను పరిశీలించి రికార్డులను చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విక్రయించిన ఎరువుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ కిశోర్‌లింకన్, ఎంపీడీవో హేమసుంద్రరావు, ఏవో ఎ.కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు ఎ.సన్యాసిరావు, ఎ.కృష్ణవేణి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాదిలో అన్నసమారాధన



అన్నసమారాధనలో భోజనాలు వడ్డిస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) మండలంలో వడ్డాది గ్రామంలో శనివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డాది టీడీపీ అధ్యక్షుడు దొండా నరేశ్, పార్టీ నేత టి.శంకర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కటింగ్ మిషన్‌ను వినియోగంలోకి తెండి



సిబ్బందితో మాట్లాడుతున్న స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్

దేవరాపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంపద కేంద్రంలో ప్లాస్టిక్ కటింగ్ మిషన్ పనిచేసే చర్యలు తీసుకోవాలని స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ డి.పద్మిని ఆదేశించారు. ఈ కేంద్రాన్ని శనివారం సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ప్లాస్టిక్ కటింగ్ మిషన్‌పని చేసే విధంగా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శి ఉమాదేవిని ఆదేశించారు. అలాగే రైవాడలో స్వచ్ఛభారత్ కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి మంజులావాణి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎంపీడీవో సువర్ణరాజు, కోఆర్డినేటర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో క్వారీ లారీలతో ఇబ్బందులు

రోలుగుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో క్వారీ లారీలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక శివాలయం రహదారి మీదుగా ప్రయాణించే క్వారీ లారీలు ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించే వైర్లను తెంపేయడంతో పలు ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రహదారి వెంబడి అధిక రాయి లోడ్‌తో క్వారీ లారీలు నడుపుతున్నారని, దీనివల్ల తమకు ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోయారు. దీంతో పాటు అధిక బరువుతో నడపడం వల్ల తరచూ తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లు కూడా పగిలిపోతున్నాయన్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ రహదారి మీదుగా వేగం తగ్గించి, అధిక లోడ్ పరిమితి తగ్గించి లారీలను నడపాలని వారు కోరుతున్నారు.



ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన 'సేనతో సేనాని' సభలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్, వేదికపై పార్టీ నాయకులు



'సేనతో సేనాని సభలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్

జనసేనలో ఫుల్ జోష్



సభను ప్రారంభిస్తున్న వీరమహిళ గోవిందమ్మ

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం జరిగిన 'సేనతో సేనాని' సభకు జన సైనికులు పోటెత్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే సమావేశ ప్రాంగణానికి చేరుకోవడంతో కుర్చీలు నిండిపోయాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జనసేన జెండా, కండువాలను ఊపుతూ అరుపులు, కేకలు, ఈలలు వేశారు. కార్యకర్తలు మాట్లాడుతున్న సమయంలో జన సైనికులు ఉత్తేజం పొందారు. కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానుల కోరిక మేరకు పవన్ కల్యాణ్ కండువా వేసుకుని, జెండాలు పట్టుకోవడంతో ఉప్పొంగిపోయారు. పవన్ మాట్లాడుతున్నంత సేపు జనసైనికులు కరతాళధ్వనులతో హోరెత్తించారు. దక్షిణ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ సభను ముందుండి నడిపించారు.



వేదికపై పవన్ కల్యాణ్, నాదెండ్ల, దుర్గేశ్ చిరునవ్వులు



సభా ప్రాంగణంలో వీర మహిళల సందడి



పార్టీ కార్యకర్తలు, నాయకులతో కిక్కిరిసిన సభా ప్రాంగణం



పవన్ ప్రసంగానికి కేరింతలు కొడుతున్న వీర మహిళలు



ఒడిశా నుంచి వచ్చిన అభిమానులతో పవన్ కల్యాణ్



బెంగళూరు నుంచి వచ్చిన విద్యార్థి నాయకులు



దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న పవన్



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సభకు హాజరైన కోన తాతారావు, జిల్లా నాయకులు



సభా వేదికపై ఎమ్మెల్యేలు కొణతాల, పంచకర్ల, సుందరపు, తదితరులు

ఆడబిడ్డ పథకం అమలుకు కార్యాచరణ

» మహిళలు శక్తి స్వరూపులు » హోం మంత్రి అనిత



మాట్లాడుతున్న హోం మంత్రి అనిత



సూపర్ సిక్స్ ప్లకార్డులను చూపుతున్న మహిళలు

నక్కపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకంలో భాగంగా త్వరలో ఆడబిడ్డ నిధి పథకాన్ని కూడా కూటమి ప్రభుత్వం ప్రారంభిస్తుందని, ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అభివృద్ధి-సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందన్నారు. మండలంలోని వేంపాడు టోల్‌ప్లాజా సమీపాన వున్న కన్వెన్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం నియోజకవర్గం మహిళా సంఘాల ప్రతినిధులతో స్త్రీశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి అనిత మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు నిండిన ఆడబిడ్డలందరికీ ఆడబిడ్డ నిధి పథకం వర్తిస్తుందని చెప్పారు. మహిళలు రాజకీయాలు సహా అనేక రంగాల్లో రాణిస్తున్నారంటే అది టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ పెట్టిన భిక్షేనన్నారు. మహిళలు శక్తి స్వరూపులన్నారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తున్నామని చెప్పారు. డ్వాక్రా సంఘాల సృష్టికర్త సీఎం చంద్రబాబునాయుడేనని, మహిళను అన్ని రంగాల్లో ప్రోత్సహించారని తెలిపారు. మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈగల్ వ్యవస్థ ద్వారా గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. నియోజకవర్గంలో బొమ్మల పరిశ్రమ వస్తే రూ.25 వేల మంది మహిళలకు ఉపాధి దొరుకుతుందని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జిలల్లా ఫిషరీస్ అధికారిణి విజయ, సీడీపీవో శ్రీవిద్య పాల్గొన్నారు.

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం బస్సులకు తాత్కాలిక బ్రేక్

» బస్సు దగ్ధం నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాలు

» అన్నీ స్టీల్‌సిటీ డిపోనకు తరలింపు

» బస్సుల కండిషన్‌ను పరిశీలించిన సీనియర్ అధికారులు



స్టీల్‌సిటీ డిపోలో నిలిచిపోయిన జేఎన్ఎన్‌యూఆర్‌ఎం బస్సులు

ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం) కింద కొనుగోలు చేసిన 18 బస్సులకు తాత్కాలికంగా బ్రేక్‌పడింది. వీటిని స్టీల్ సిటీ డిపోలో నిలిపివేశారు. ఈ డిపో నుంచి విజయనగరం వెళుతున్న జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం మెట్రో ఎక్స్‌ప్రెస్ శుక్రవారం జాతీయ రహదారిపై శాంతిపురం జంక్షన్ వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఈ విషయం నగరంలోనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి వెళ్లింది. దీంతో అధికారులను విచారించారు. రీజియన్‌లో ఉన్న అలాంటి బస్సులన్నీ వెంటనే నిలిపివేయాలని, సాంకేతికతను పరిశీలించిన తరువాత మాత్రమే రవాణా సేవలకు వినియోగించాలని ఆదేశించారు. దీంతో ఈ బస్సులన్నింటినీ శుక్రవారం మధ్యాహ్నం స్టీల్ సిటీ డిపోనకు తరలించారు.

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాకు 2015-17 మధ్య నాలుగు దశల్లో 18 బస్సులు వచ్చాయి. జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వీటిని సమకూర్చింది. వీటి కొనుగోలు ఖర్చులో 50 శాతం కేంద్రం భరించగా, మిగిలిన మొత్తం ఆర్టీసీ చెల్లించింది. ఈ బస్సులు హైవే రన్నింగ్‌కు బాగుంటాయని అప్పటి అధికారులు స్టీల్‌సిటీ డిపోనకు కేటాయించారు. ఇందులో 16 బస్సులను విజయనగరం, రెండు బస్సులు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ రూట్లలో నడుపుతున్నారు.

నిపుణుల పరిశీలన

నగరంలో శుక్రవారం ఒక బస్సు దగ్ధమైన నేపథ్యంలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం బస్సుల సాంకేతికతను మెకానికల్ ఇంజనీర్ల బృందం శనివారం పరిశీలించింది. విజయవాడ నుంచి వచ్చిన ఆర్టీసీ సీనియర్ మెకానికల్ ఇంజనీర్లు శర్మ, మాధవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మెకానికల్) బ్రహ్మానందరెడ్డిలు శాంతిపురం జంక్షన్‌లో శుక్రవారం దగ్ధమైన బస్సును, స్టీల్‌సిటీ డిపోలో నిలిపి ఉంచిన బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. వీరికి విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, మెకానికల్ ఫోర్‌మన్, ఇద్దరు అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్లు బస్సుల పనితీరును వివరించారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్

» అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి

» రికార్డులు లేని 13 బైక్‌లు, ఒక ఆటో, రెండు కార్లు స్వాధీనం

చీడికాడ, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): గంజాయి నిర్మూలనే లక్ష్యంగా గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రావణి ఆధ్వ ర్యంలో కె.కోటపాడు సీఐ పైడంనాయుడు, స్థానిక ఎస్ఐ పి.సతీశ్ సారథ్యంలో 15 మంది ఎస్ఐలు, 100 మంది పోలీసులు శనివారం వేకువ జాము నాలుగు గంటల నుంచి ఉదయం 8గంటల వరకు బైలపూడి గ్రామంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. దీనిలో భాగంగా రికార్డులు లేని 13 బైక్‌లు, ఒక ఆటో, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రావణి మాట్లాడుతూ, బైలపూడిలో గంజాయి కేసుల్లో ఇప్పటి వరకూ 38మంది అనుమాని తులతోపాటు 92 మంది నింది తులుగా ఉన్నారన్నారు. వారికి ప్రతి వారం కౌన్సెలింగ్ నిర్వహి స్తున్నామన్నారు. ఏడాది కాలం లో ఈ గ్రామానికి చెందిన 11మందికి గంజాయి కేసుల్లో పదేళ్ల జైలుతోపాటు ఒకొక్కరికి లక్ష రూపాయలు చొప్పున జరిమానా కోర్టు విధించిందన్నారు.



మాట్లాడుతున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

క్రైం... crime news

12 కిలోల గంజాయి స్వాధీనం » ఇద్దరి అరెస్టు

కోటవురట్ల ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలం లోని జల్లూరు జంక్షన్ వద్ద శనివారం 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ రమేశ్ తెలిపారు. అల్లూరి జిల్లా చింతపల్లి ఏజెన్సీ నుంచి విశాఖపట్నానికి ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు జల్లూరు జంక్షన్ వద్ద పట్టుకున్నామన్నారు. 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామని, మరొకరు పరారైనట్టు తెలిపారు. అరెస్టు అయిన వారిలో మహిళ ఉందన్నారు. పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఏటీఎం మోసగాళ్ల అరెస్టు

పరవాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎస్‌బీఐకి చెందిన ఏటీఎం కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని నగదును అపహరించిన ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పరవాడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 8,800లు నగదు, ద్విచక్ర వాహనం, చోరీకి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివసింగ్, ప్రదీప్‌సింగ్ చౌహాన్‌లు కలిసి ఈ నెల 28న పరవాడ సినిమాహాల్ జంక్షన్‌లో గల ఏటీఎం కేంద్రం నుంచి రూ. 10 వేలు, దేశపాత్రునిపాలెం సమీపంలో గల ఏటీఎం కేంద్రం నుంచి రూ.4,200లు నగదును అపహరించారు. దీనిపై ఏటీఎం కేంద్రానికి చెందిన ఎగ్జిక్యూటివ్ కంఠంరెడ్డి సోమినాయుడు అదే రోజున పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఏటీఎం కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీల ద్వారా నిందితులను గుర్తించారు. శనివారం నిందితులను పరవాడ సబ్ స్టేషన్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేసే క్రమంలో పట్టుకున్నారు. వారి నుంచి నగదును, ద్విచక్ర వాహనం, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దర్నీ అనకాపల్లి కోర్టులో హాజరుపరిచి, 14 రోజుల పాటు రిమాండ్‌కు అనకాపల్లి సబ్‌జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

ఐటీబీపీ హెడ్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

ఆనందపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం పందలపాక సమీపంలోని 56వ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌లో ఒక కానిస్టేబుల్ (జీడీ) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా డోన్ మండలం ఆర్ఎస్ రంగాపురం ప్రాంతానికి చెందిన జగదల నరేంద్రనాథ్ (32) ఐటీబీపీలో కానిస్టేబుల్‌గా (జీడీ)గా పనిచేస్తున్నాడు. 2014లో పోలీస్ శాఖలో చేరిన నరేంద్రనాథ్ గత 15 నెలలుగా 56వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అయితే శుక్రవారం గార్డు విధులు నిర్వర్తిస్తూ రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌లోని మామిడి చెట్టుకు నైలాన్ వైర్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు బెటాలియన్ ఇన్‌చార్జి సూరజ్ ప్రకాశ్‌జోషి ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సీఐ చింతా వాసునాయుడు, ఎస్ఐ సంతోష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

సేనలో నూతనోత్సాహం

... 5వ పేజీ తరువాయి

పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రాంగణానికి చేరుకున్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

తొలుత రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన పలువురు క్రియాశీలక కార్యకర్తలు సభలో ప్రసంగించారు. రమేష్ అనే కార్యకర్త మాట్లాడుతూ పిల్లసేన, కోతి సేన అన్నవారికి లంకా దహనం ఎలా ఉంటుందో చూపించామన్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన కార్యకర్త శ్రీకాంత్ మాట్లాడుతూ అసాధ్యాలను సుసాధ్యం చేయడం జనసైనికులకు మాత్రమే సొంతమన్నారు. భీమవరానికి చెందిన విజయలక్ష్మి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జనసేనకు విజయం దక్కలేదని, అయితే 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో తమ ప్రాంతంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జడ్పీటీసీ సభ్యులు గెలుపొందడం ద్వారా సాధారణ ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి బాటలు వేశామన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రతి గుడిసెపై జనసేన జెండా ఎగురుతుందని ఆ ప్రాంతానికి చెందిన శివ అన్నారు. శ్రీకాకుళానికి చెందిన విష్ణు ప్రియాంక మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ వలనే ఉద్దానం సమస్య ప్రపంచానికి తెలిసిందని, అక్కడ ఇంకా అనేక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. అనంతరం ఆమె పవన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కర్ణాటక జెండా, కండువాతో పవన్..

పవన్ వేదికపైకి రాగానే అభిమానులు ఈలలు, చప్పట్లతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు అభివాదం చేశారు. ఈ క్రమంలోనే కర్ణాటక నుంచి వచ్చిన పలువురు కార్యకర్తలు పెద్దఎత్తున కేకలు వేస్తూ తమ రాష్ట్ర అధికారిక జెండాలను ప్రదర్శించారు. వారిని చూసిన పవన్ కల్యాణ్ కర్ణాటక జెండా, జనసేన జెండాతో కలిపి పట్టుకుని, మెడలో కర్ణాటక రాష్ట్ర జెండా రంగుతో కూడిన కండువాను వేసుకున్నారు. అనంతరం ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితోనూ పవన్ ఫొటోలు దిగారు. పవన్ కల్యాణ్ ప్రసంగం అనంతరం మత్స్యకారులు చేప, వల, పడవ చిత్రాన్ని ఆయనకు బహూకరించారు. పవన్ కల్యాణ్ చిత్రాన్ని పచ్చబొట్టు వేయించుకున్న మత్స్యకార యువకుడితో పవన్ ఫొటో దిగారు. అనంతరం మృతిచెందిన కార్యకర్తల కుటుంబసభ్యులకు చెక్కులను అందించారు.

నిబంధనలకు పాతర.. అక్రమాల జాతర

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీకి చలానా కట్టి భవనం నిర్మించినట్టు తెలిసింది. ప్రస్తుతం ఆ భవనంలో ఒక ప్రైవేటు ఆస్పత్రి నడుస్తోంది. ఇదే వీధిలో మరో ప్రైవేటు ఆస్పత్రి యజమాని ఎటువంటి అనుమతులు పొందకుండానే భవనం నిర్మించారని సమాచారం. రింగ్ రోడ్డు జంక్షన్‌కు సమీపంలో ఒక భారీ భవనాన్ని రెసిడెన్సియల్ కోసం అనుమతులు పొంది ప్రస్తుతం ఆ భవనంలో కన్వెన్షన్ హాలు నడుపుతున్నారు. గాంధీనగర్, లక్ష్మీనారాయణ నగర్, రఘురామ కాలనీల్లో రెండు అంతస్థుల భవనాలకు అనుమతులు తీసుకొని నాలుగైదు, అంతస్థుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో సరైన రోడ్డు లేకపోయినా భారీ భవన నిర్మాణం చేపడుతున్నారు. పెరుగుబజారు, రింగురోడ్డు, గవరపాలెం, రఘురామ కాలనీలో మాస్టర్ ప్లాన్‌లో 40 అడుగుల రోడ్డుకు సమీపంలో భవన నిర్మాణాలు చేపడుతుండడంతో భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను గుర్తిస్తాం

జోనల్ కార్యాలయం పరిధిలో నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు జరుగుతుండడంపై జోనల్ కమిషనర్ చక్రవర్తిని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా, ఆ వార్డుల సచివాలయాల పరిధిలో ప్లానింగ్ కార్యదర్శులను అప్రమత్తం చేసి, అనుమతులు లేని నిర్మాణాలను గుర్తిస్తామని తెలిపారు. జోనల్ కార్యాలయం పరిధిలో ప్లానింగ్ అనుమతులు పొందకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించి, అవసరమైతే నోటీసులు జారీ చేస్తామన్నారు.

ఆస్పత్రుల అభివృద్ధికి రూ.1.19 కోట్లు మంజూరు

... 5వ పేజీ తరువాయి

అర్బన్ పీహెచ్‌సీకి రూ.3 లక్షలు, పెదబొడ్డేపల్లి అర్బన్ పీహెచ్‌సీకి రూ.11 లక్షలు, బలిఘట్టం అర్బన్ పీహెచ్‌సీకి రూ.27 లక్షలు... మొత్తం 72.5 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయితే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన చెప్పారు.

ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

... 5వ పేజీ తరువాయి

సమర్పించలేకపోయారు. ప్రస్తుతానికి వారిని అనర్హులుగా ప్రకటించారు. దీనిపై పాఠశాల విద్యాశాఖ తుది నిర్ణయం తీసుకోవవలసి ఉంది. కాగా ధ్రువపత్రాల పరిశీలన ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. అభ్యర్థులకు నియామక పత్రాలు ఎప్పుడు ఇస్తారనేది ఇంకా ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవల్సి ఉంది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	113.00
లైవ్ ధర	133.00
విత్ స్కిన్	236.00
స్కిన్ లెస్	246.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564